quicktodaynews.com
RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే
QUICK TODAY DAILY దినపత్రిక

## విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాప్ రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.
తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476 క్విక్ టుడే తెలుగు దినపత్రిక www.quicktodaynews.com

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 221 | శుక్రవారం, మే 03 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## ఆదివాసులపై బిజెపికి
# ప్రేమలేదు

- పోడు భూముల పరిష్కారంలో కెసిఆర్ నిర్లక్ష్యం
- ఆదివాసీ మహిళ సుగుణకు టిక్కెట్ ఇచ్చాం
- తుమ్మిడిహట్టిని నిర్లక్ష్యం చేసిన కెసిఆర్
- టిక్కెట్ ఇవ్వకుండా సోయం బాపూరావుకు అవమానం
- రిజర్వేషన్లు ఉండాలంటే..కాంగ్రెస్ గెలవాలి
- ఆదిలాబాద్ సభలో సిఎం రేవంత్ ఉద్ఘాటన



**ఆసిఫాబాద్,మే2క్విక్ టుడే :** ఆదివాసులపై బీజేపీకి ప్రేమ లేదని, వారిపై వివక్ష చూపుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో సోయంబాపు రావు ఎంపీగా గెలిపిస్తే బీజేపీ ఎలాంటి అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆదివా సుల పట్ల బీజేపీకి ప్రేమ ఉంటే ఇక్కడి ఎంపీకి ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదని నిలదీశారు. చివరికి సోయం బాపురావుకు బీజేపీ టికెట్ ఇవ్వకుండా అవమా నించిందని ధ్వజమెత్తారు. ఆసిఫాబాద్‌లో గురువారం రేవంత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ పాల్గొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 'జనజాతర' భారీ బహిరంగ సభలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. పేదోళ్లను బీజేపీ అభ్యర్థి గొడం నగేష్ అవమానిస్తున్నారని మండి పడ్డారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు జిల్లా అభివృద్ధికి ఏం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి సారిగా ఆదివాసీ మహిళకు ఎంపీగా అవకాశం ఇచ్చిందని తెలిపారు. మహిళలంతా కలిసి సుగుణను ఎంపీగా గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఆదిలాబాద్ పార్లమెంట్‌లో సాగునీరు, పోడు భూముల సమస్య ఉందని చెప్పుకొచ్చారు. తుమ్మడిహట్టి ప్రాజెక్టును మాజీ సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. సీసీఐ మూతపడితే కేసీఆర్, మోదీ పట్టించుకోలేదని మండిపడ్డారు. జిల్లాలో చాలా వనరులు ఉన్నా.. ఎలాంటి అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమం కోసం మిగతా 2లో...




## తెలంగాణలో భానుడి
# భగభగలు

- ఛత్తీస్‌ఘఢ్ నుంచి ద్రోణి విస్తరణ
- 6న అక్కడక్కడా తేలికపాటి వర్షాలు

**హైదరాబాద్,మే2క్విక్ టుడే :** ఎండలు మండుతున్న వేళ కొన్ని జిల్లాలకు వాతావరణ శాఖ కూల్ న్యూస్ అందించింది. ఈ నెల 6 నుంచి రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ నెల 6వ తేదీన కరీంనగర్, భూపాలపల్లి, మలుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, హన్మకొండ, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఏపీలోనూ భానుడి ఉగ్రరూపం చూపిస్తున్నాడు. దక్షిణ ఛత్తీస్ గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకూ తెలంగాణ, మిగతా 2లో...

## లిక్కర్ కేసులో కవితకు
# మరోమారు నిరాశ

- బెయిల్ తీర్పు మే 6కు వాయిదా



**న్యూఢిల్లీ,మే2క్విక్ టుడే :** దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. సీబీఐ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పును మే 6కి వాయిదా వేస్తూ రౌస్ అవెన్యూ మిగతా 2లో...

## గుజరాత్ పెత్తనం..
# తెలంగాణ ఆత్మగౌరవం

- ఎన్నికల్లో కొత్త ఎత్తుగడలు..వ్యూహాలతో రేవంత్
- మోడీకి సవాళ్లు విసురుతున్న సిఎం రేవంత్
- నేడు ప్రత్యేక మేనిఫెస్టో ఆవిష్కరణ



**హైదరాబాద్,మే2క్విక్ టుడే :** తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కూడా తెలంగాణ ఆత్మగౌరవ నినాదం ఎత్తుకున్నారు. అదీ గుజరాత్ పెత్తనం ఏంటన్నదానిపైన. ఇటీవల ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో నాగడ్డపై వచ్చి..నన్నే బెదరిస్తారా మిగతా 2లో...

## 6లక్షల ఉద్యోగాలు
# తొలగించారు

- మోడీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ,మే2క్విక్ టుడే :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లు తొలగించాలని నరేంద్ర మోదీ కుట్రకు తెరలేపారని విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'ప్రభుత్వ ఉద్యోగాలు లేవు, ఉన్న రిజర్వేషన్లను తొలగిస్తున్నారు. దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతుల నుంచి రిజర్వేషన్లు లాక్కొనేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రైవేటైజేషన్ పేరుతో బడుగుల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తుంది అని' రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. '2013లో 14 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉండేవి. 2023కు వచ్చే సరికి ఆ ఉద్యోగాల సంఖ్య 8.4 లక్షలకు చేరుకున్నాయి. బీఎస్ఎన్ఎల్, సెయిల్, బీహెచ్ఈఎల్ తదితర కంపెనీల నుంచి దాదాపు 6 లక్షల ఉద్యోగులను తొలగించారు. మిగతా 2లో...





## కెసిఆర్ బస్సుయాత్రతో
# కాంగ్రెస్,బిజెపిల్లో దడ

- అందుకే ఆగమేఘాల మీద 48 గంటల నిషేధం
- కేంద్రం చేతిలో ఇసి కీలుబొమ్మగా మారింది
- మా ఫిర్యాదులపై మాత్రం పట్టింపు లేదు
- రేవంత్ భాషపై ఫిర్యాదు చేసిన చర్యల్లేవ్
- మీడియా సమావేశంలో కెటిఆర్

వివరాలు 2లో

## ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్

- 9వరకు నామినేషన్ల స్వీకరణ

వివరాలు 2లో

## త్వరలో ఖమ్మంకు
# రాహుల్ గాంధీ



వివరాలు 4లో

(మొదటి పేజీ తరువాయి)

## ఆదివాసులపై బిజెపికి ప్రేమలేదు

కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. 3నెలల్లో 30వేల ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేశారు. బలహీన వర్గాలకు కులగనణ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలియచేశారు. బీజేపీ పార్టీపై విమర్శలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. దేశంలో రాజ్యాంగాన్ని మర్చేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఈ దేశంలో ఉన్న రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ చూస్తుందని విమర్శించారు. అందుకే 2021లో జరగాల్సిన జనాభా లెక్కలు చేయలేదని తెలిపారు. రిజర్వేషన్లు రద్దు చేయాలన్న రహస్య ఒప్పందం నడిచిందని అందుకే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న 8 రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చిందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని అన్నారు. ఓటు వేసి రిజర్వేషన్ ను రద్దు చేయించుకుంటారా అని ప్రజలను అడిగారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలన్న కుట్ర బీజేపీ చేస్తుందని ఆరోపించారు. ఇవి మాట్లాడితే తనపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్ గెలవాలని చెప్పారు.
కాంగ్రెస్ పార్టీ కులగణన చేస్తుందని రిజర్వేషన్లు ఇంకా పెరిగే అవకాశం ఉందని అన్నారు. తెలంగాణకు బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చిందని విమర్శించారు. కేసీఆర్ మోదీ తెలంగాణకు ఏం చేయలేదని ఆరోపించారు. సోయం బాపూరావును ఎంపీగా గెలిపిస్తే ఆదిలాబాద్ కు ఏం ఇచ్చారని ప్రశ్నించారు. ఆదిలాబద్ పార్టమెంట్ సీటును ఏ పార్టీ కూడా ఇంత వరకు మహిళకు ఇవ్వలేదని ఫస్ట్ టైం సోనియా గాంధీ ఆత్రం సుగుణకు ఇచ్చారని ఆమెను భారీ మెజారిటీతోని గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోను ఐదు గ్యారెంటీలు అమలు చేశామని తెలిపారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## తెలంగాణలో భానుడి భగభగలు

రాయలసీమ మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ద్రోణి విస్తరించి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో గురు, శుక్రవారాల్లో ఉత్తర కోస్తా, యానాం ప్రాంతాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పారు. దక్షిణ కోస్తాలో శనివారం ఒకటి రెండు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. రాయలసీమలో శుక్రవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అన్నారు. మరోవైపు, తిరుపతిలో గురువారం వాతావరణ ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి వాతావరణం కొంచెం చల్లగా ఉండగా.. భారీ వర్షం పడింది. తిరుమల శ్రీవారి ఆలయం, నాలుగు మాడ వీధులు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉక్కబోతతో అల్లాడిన ప్రజలు ఈ వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. అటు, ఈదురుగాలులతో వర్షం కురుస్తున్నందున పంటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇకపోతే తెలంగాణలో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో జనం వణికిపోతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు జిల్లాలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. బుధవారం అత్యధికంగా నల్గొండ జిల్లా గూడపూర్‌లో 46.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో 47 డిగ్రీల మార్క్‌ను దాటే అవకాశం ఉందని వాతావరణ విభాగం అధికారులు హెచ్చరిస్తున్నారు. గురువారం నుంచి శనివారం వరకు దీర్ఘకాల వడగాలులు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. అలాగే, ఈ నెల 6 నుంచి రాష్ట్రంలో తేలికపాటి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు కొనసాగుతాయని హెచ్చరించింది. శుక్రవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడ వడగాలులు వీస్తాయని చెప్పింది. ఈ నెల 6న రాష్ట్రం నుంచి పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

## లిక్కర్ కేసులో కవితకు మరోమారు నిరాశ

కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పును మే 6న వెలువరిస్తామని జడ్జి కావేరి బవేజా గురువారం ప్రకటించారు. కాగా ఇదివరకే కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా పడింది. ఏప్రిల్ 22న తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. గురువారం జైలా లేదా బెయిలా అనేది తేలుతుందని అంతా భావించారు. కానీ కవితను నిరాశకు గురిచేస్తూ తీర్పును మరోసారి కోర్టు వాయిదా వేసింది.మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలని, అరెస్ట్ నుంచి విచారణ వరకు కవితకు వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవని వాదనలు కవిత తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ పార్టీకి స్టార్ క్యాంపైనర్‌గా ఉన్నందున ఎన్నికల్లో ప్రచారం కోసం బెయిల్ ఇవ్వాలని కవిత కోరారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసులకు అరెస్ట్ అవసరం లేదని, కవిత అరెస్టుకు సరైన కారణాలు లేవని, మహిళగా ఆరోగ్యపరమైన కారణాలు పరిగణలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలని కవిత న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. లిక్కర్ కేసులో కవిత కీలక వ్యక్తిగా ఉన్నారని సీబీఐ తరపు లాయర్లు వాదించారు. ఈ కేసుకు సంబంధించి చాలా విషయాలు కవితకు తెలుసునని, ఇతరులు ఇచ్చిన స్టేట్‌మెంట్స్, ఆధారాలపై ఆమెను విచారించినా నిజాలు చెప్పడం లేదని కోర్టుకు సీబీఐ న్యాయవాదులు తెలిపారు. హై పొలిటికల్ పవర్ ఉన్న కవిత ఈ కేసు దర్యాప్తును ఆధారాలు సాక్ష్యాలను ప్రభావితం చేయగలరని బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ వాదించింది. ఇంతకు ముందు ఎక్సైజ్ పాలసీ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కే కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 7వ తేదీ వరకు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పునిచ్చింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 15న ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## గుజరాత్ పెత్తనం..తెలంగాణ ఆత్మగౌరవం

అంటూ హూంకరించారు. ఇకపోతే తెలంగాణలో బిజెపితో పరమాదం ఉందని గుర్తించిన రేవంత్ రెడ్డి దానిని ఎదుర్కొనేందుకు వ్యూహాలు పన్నుతున్నారు. అందుకే ఢిల్లీ పోలీసుల కేసుతో బిజెపిని ఇరుకున పెట్టేందుకు ఘాటుగానే స్పందిస్తున్నారు. అలాగే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణకు ప్రత్యేక మ్యానిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ విడుదల చేయనుంది. శుక్రవారం ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి దీన్ని ఆవిష్కరించనున్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే.. రాష్ట్రానికి ఏం చేస్తామనేదాన్ని ఆయన వెల్లడించనున్నారు. విభజన హామీల అమలు, ప్రత్యేక కారిడార్లు, ఇంటర్నేషనల్ స్కూళ్లు తదితర అంశాలకు ఇందులో చోటు కల్పించనున్నట్లు సమాచారం. ఇప్పటికే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ 'న్యాయ్ పత్ర' పేరుతో మ్యానిఫెస్టోను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జరిగే మేలు ఏమిటన్నది చెప్పబోతున్నారు. అలాగే బిజెపి పదేళ్లుగా తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డని ప్రచారం చేస్తున్నారు. అంతేగాకుండా 'గుజరాత్ ఆధిపత్యానికి.. తెలంగాణ ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న పోరు ఇదని అన్నారు. కుట్రలకు పాల్పడుతున్న భాజపాకు నిజాం, రజాకార్లకు పట్టిన గతే పడుతుంది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘాటుగానే హెచ్చరిస్తున్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించిన జనజాతర సభలో, చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని లింగంపల్లిలో, మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని మూసాపేట, కూకట్‌పల్లిలలో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. ఆయా చోట్లా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. 'ఈ సారి జరిగే లోక్‌సభ ఎన్నికలు ఆషామాషీవి కావు. గతంలోకంటే భిన్నమైన పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. 400 సీట్లు గెలవడం ద్వారా రిజర్వేషన్లను ఎత్తివేసి అదానీ, అంబానీల కు దేశాన్ని అమ్మాలని భాజపా కుట్ర చేస్తోంది. ఊరూరా బీసీ, ఎస్సీ, ఎస్టీలను జాగృతం చేస్తున్నానని.. పగబట్టి నన్ను అత్యవసరంగా అరెస్టు చేయాలని దిల్లీలో కేసు పెట్టారు.

## 6లక్షల ఉద్యోగాలు

అలా తొలగించిన వారంతా రిజర్వేషన్‌తో కొలువు పొందినవారే. రైల్వే వంటి సంస్థల్లో కాంట్రాక్టుపై పని కల్పిస్తున్నారు. కొందరు ఉద్యోగులను తొలగిస్తున్నారు. ప్రధాని మోదీ ఉద్దేశంలో ప్రైవేటీకరణ అనేది దేశ వనరులను దోచుకోవడం, దీంతో బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లను దొంగిలించడం. కాంగ్రెస్ పార్టీ ఇస్తోన్న గ్యారంటీలతో ప్రభుత్వ రంగాలు బలోపేతం అవుతాయి. సమాజంలో ఉన్న అన్ని వర్గాలకు ఉపాధి లభిస్తోంది. 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తాం' అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

## ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్

### 9వరకు నామినేషన్ల స్వీకరణ


**హైదరాబాద్:** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో నామినేషన్లు కూడా ప్రారంభమయ్యాయి. ఈ నెల 9 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసింది. మే 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నది. ఈ నెల 27న పోలింగ్ నిర్వహిస్తారు. జూన్ 5న ఓట్లు లెక్కించనున్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్సీగా విజయం సాధించిన పల్లా రాజేశ్వర్ రెడ్డి గతేడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆమర తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈనేపథ్యంలో ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమయింది. కాగా, ఈ నియోజకవర్గం పరిధిలో 4,61,806 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. ఈ ఉపఎన్నికకు నల్లగొండ జిల్లా కలెక్టర్‌ను ఎన్నికల అధికారిగా ఈసీ నియమించింది. అభ్యర్థులు నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది.

### కెసిఆర్ బస్సుయాత్రతో

## కాంగ్రెస్,బిజెపిల్లో దడ

**అందుకే ఆగమేఘాల మీద 48 గంటల నిసేధం - కేంద్రం చేతిలో ఇసి కీలుబొమ్మగా మారింది**
**మా ఫిర్యాదులపై మాత్రం పట్టింపు లేదు - రేవంత్ భాషపై ఫిర్యాదు చేసిన చర్యల్లేవ్**
**మీడియా సమావేశంలో కెటిఆర్**

**హైదరాబాద్:** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభంతో కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెల్లో దడ పుట్టిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ బస్సు యాత్రకు వస్తున్న ప్రజా స్పందనను చూసి ఆ రెండు పార్టీలు ఓర్వలేకపోతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అందుకే మోడీ,రేవంత్ ఒక్కటై ఇసితో నిషేధం విధించారని అన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన పరుష పదజాలం మీద ఎన్నికల సంఘానికి 8 ఫిర్యాదులు ఇచ్చాం. కానీ చర్యల్లేవు. కేసీఆర్‌ను ఉరితీస్తాం.. లాగుల తొండలు వదులుతాం.. ముడ్డి మీద డ్రాయర్ కూడా ఉండదు.. కేసీఆర్ తల నరకండి.. కేసీఆర్ తల తెగ్గోయండి అని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ మాటలు ఎన్నికల సంఘానికి నీతిసూక్తులు, సుభాషితాల్లాగా వినబడుతున్నట్లుంది. ఈ మాటలు ఈసీకి వినిపించవు. అదే కేసీఆర్ నేతన్నలు, రైతుల పక్షాన మాట్లాడితే గట్టిగా ఒక్క మాట మాట్లాడితే.. 48 గంటల నిషేధం విధించారు అని కేటీఆర్ తెలిపారు. బడా భాయ్.. చోటా భాయ్ కనుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం పని చేయకపోతే.. తామిచ్చిన 27 ఫిర్యాదులపై స్పందించాలి. రేవంత్ మీద 8, మరో 19 ఫిర్యాదులు మిగతా పార్టీ నాయకులు, వారి వైఖరి మీద ఈసీకి ఫిర్యాదు చేశాం. ఒక్కటంటే ఒక్కదాని మీద కూడా చర్య లేదు. కొండా సురేఖకు మందలింపు తప్ప ఒక్కటంటే ఒక్క చర్య లేదు. వారి ప్రచారాన్ని నిషేధించలేదు. కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభించగానే కాంగ్రెస్‌కు, బీజేపీకి దడ పుట్టింది. స్టేట్‌లో ఇంటెలిజెన్స్ రిపోర్ట్, కేంద్రంలో ఐబీ రిపోర్టు ఎప్పటికప్పుడు ఇస్తున్నాయి. కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మంచి స్పందన వస్తుందని ఆ పార్టీలకు కంటగింపుగా మారింది. 2014లో బడా భాయ్ చేసిన మోసం, 2023లో చోటా భాయ్ చేసిన మోసాన్ని పూసగుచ్చినట్టు ప్రజలకు వివరిస్తుంటే.. తట్టుకోలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇది ఒక పన్నాగం అనేది పార్టీ స్థిరమైన అభిప్రాయం అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ బస్సు యాత్రకు జనస్పందన చూసిన తర్వాత రెండు పార్టీలకు నిద్ర పట్టడం లేదు. 8 -12 సీట్లు బీఆర్ఎస్‌కు వస్తున్నాయని సర్వేలు వస్తున్నాయి. మొన్నటి దాకా బీఆర్ఎస్‌ను ఒక్క సీటు కూడా గెలవనివ్వం అని అన్నారు. కేసీఆర్ బస్సు యాత్ర తర్వాత వస్తున్న స్పందనను జీర్ణించుకోలేక ఇద్దరు కూడబలుక్కొని కేసీఆర్‌ను ప్రజల వద్దకు వెళ్లనీయకుండా ఆపడం అప్రజాస్వామిక చర్య. ప్రజలు దీనికి ఓటుతోనే సమాధానం చెప్తారని అనుకుంటున్నాను అని కేటీఆర్ తెలిపారు. రేవంత్ రెడ్డి ఇంకా చండాలంగా మాట్లాడారు. ఆ మాటలు మేం అనేందుకు సిగ్గు అనిపిస్తుంది. ఆయన మాటలపై ఫిర్యాదు చేస్తే.. గోడకు చెప్పుకున్నట్టే ఉంది కానీ ఈసీ నుంచి స్పందన లేదు. కానీ కేసీఆర్ పట్ల రాకెట్ వేగంతో స్పందించి నిషేధం విధించారు. మీది నిజంగా స్వయం ప్రతిపత్తి సంస్థ అయితే.. ఎందుకు మోదీ మీద చర్యల్లేవు. మోదీకి నోటీసులు ఇవ్వాలంటే ఎందుకు వణికి చచ్చిపోతున్నారు. నడ్డాకు ఎందుకు ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి విషయంలో మీ గొంతు ఎందుకు పెగడలం లేదు..? 48 గంటల పాటు కేసీఆర్ ప్రచారాన్ని నిషేధించొచ్చు కానీ కేసీఆర్ తయారు చేసిన సైన్యాన్ని మీరు అడ్డుకోలేరు అని కేటీఆర్ తేల్చిచెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ కనుసన్నల్లో కేంద్ర ఎన్నికల సంఘం నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్న మోదీకి, అమిత్ షాకు నోటీసులు జారీ చేయరు. కానీ ఆవేదనతో మాట్లాడిన కేసీఆర్‌కు మాత్రం నోటీసులు జారీ చేసి, 48 గంటల పాటు ప్రచారంపై నిషేధం విధించారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇవాళ రాష్ట్రంలో, దేశంలో ఉన్న పరిస్థితులు చూస్తుంటే.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం, వారు తీసుకున్న నిర్ణయాలు దానికి అనుగుణంగా జరిగిన నియామకాలు, స్వయం ప్రతిపత్తి సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ఆటాడిస్తున్నట్లు స్పష్టమవుతుంది. చివరకు ఎన్నికల కమిషన్ కూడా బీజేపీ కనుసన్నల్లో నడుస్తోంది. ఇందులో ఎలాంటి రెండో ఆలోచన, అభిప్రాయం తమకు లేదు. దేశంలో బీజేపీ వాళ్లు జాతులు, మతాల ఆధారంగా.. ప్రధాని, హోం మంత్రి మత వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడిన, విద్వేషాన్ని రెచ్చగొట్టేలా దారుణమైన వ్యాఖ్యలు చేసినా, ప్రత్యర్థ పార్టీలను బీజేపీ నాయకులు బండబూతులు తిడుతున్నా.. వాళ్ల బీజేపీ4ఇండియా అఫిషియల్ ట్విట్టర్ ముస్లింలపై విషం చిమ్ముతూ.. ప్రచారం చేస్తున్నా ఒక్క చర్య లేదు. కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి నోటీసులు జారీ చేయలేదు అని కేటీఆర్ తెలిపారు. ఇటీవలే మోదీ దారుణంగా మాట్లాడారు. ఈ దేశంలో ముస్లింలే ఎక్కువ పిల్లలు కంటారని, వేరే వారు అధికారంలోకి వస్తే దేశ సంపదను ముస్లింలకు దోచి, పంచి పెడుతారని ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తే దాదాపు 25 వేల మంది పౌరులు ఎన్నికల కమిషన్‌కు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. కానీ కనీసం మోదీకి నోటీసు కూడా ఇవ్వలేదు. చర్యలు తీసుకోవడం లేదు. మోదీకి భయపడ్డ ఎన్నికల సంఘం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు నోటీసులు జారీ చేశారు. మోదీ వ్యాఖ్యలపై నడ్డా జవాబు ఇవ్వాలని తలాతోక లేని నిర్ణయం ఎన్నికల కమిషన్ తీసుకుంది అని కేటీఆర్ గుర్తు చేశారు. ఎన్నికల్లో దేవుడిని, మతాన్ని ఇన్‌వాల్వ్ చేయడం నేరం. అమిత్ షా శ్రీరాముడి బొమ్మ పట్టుకుని ఎన్నికల ప్రచారం చేశారు. దీనిపై కూడా ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. అయినా ఉలుకు పలుకు లేదు. బీజేపీ అభ్యర్థి అరుణ్ గోవిల్ గతంలో రామాయణం సిరీయల్‌లో రాముడి పాత్ర పోషించారు. ఆయన రాముడి ఫొటోతో ప్రచారం చేశారు. చర్య, నోటీసులు లేవు.

PLOTS FOR SALE

JANAGAON TOWN
SRI SAI RAM VENTURE
జనగామ జిల్లా కేంద్రం.. నర్మెట్ట రోడ్
చదరపు గజం రూ.4500 -6500
99592 02369

PVR CONSTRUCTIONS
HOUSE FOR SALE

INDEPENDENT HOUSE
EAST - 167 SQ. YADS & WEST - 156 SQ. YADS
NEAR JODIMETLA X ROAD,
WARANGAL HIGHWAY, HYDERABAD
9885119830
7013672656
8106654775

PLOTS FOR SALE
JANAGAON TOWN
HANUMAKONDA ROAD
78930 45646
96769 74480

జన్మదిన, వివాహ
పదవీ విరమణ
శుభాకాంక్షలు

ఉద్యోగం, వ్యాపారం
రియల్ ఎస్టేట్
బహిరంగ ప్రకటనలు

జయంతి, వర్ధంతి
శ్రద్ధాంజలి, నిర్యాణము
అన్ని రకాల ప్రకటనల కోసం సంప్రదించండి
88864 60073
81259 72476

## కోటపల్లి మండలంలో
# బీజేపీ కార్నర్ మీటింగ్




**చెన్నూర్, మే 02. క్విక్ టుడే న్యూస్ :** బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోటపల్లి మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ కోటపల్లి బీజేపీ మండల అధ్యక్షులు మంత్రి రామయ్య గారి అధ్యక్షతన జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్ బీజేపీ కి మద్దతుగా భారీ సంఖ్యలో జనం పాల్గొని బీజేపీకి మద్దతు తెలిపారు అదే విధంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేతబీజేపీ సీనియర్ నాయకులు అందుగుల శ్రీనివాస్ బీజేపీ జిల్లా కన్వీనర్ అక్కల రమేష్ ఎంఆర్పీస్ మంచిర్యాల అధ్యక్షులు చెన్నూరు సమ్మయ్య పాల్గొన్నారు గోమాస శ్రీనివాస్ మాట్లాడుతూ ఇవ్వాళ భారత దేశం బాగుండాలి అంటే కేంద్రం లో బీజేపీ పార్టీ నరేంద్ర మోడీ గారే ఉండాలి కాబట్టి కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి నన్ను పెద్దపల్లి ఎంపీ గా నన్ను గెలిపించి నరేంద్ర మోడీ కి కానుకగా పంపించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో కోటపల్లి మండల బీజేపీ ఇంచార్జి కాశెట్టి నాగేశ్వర్ రావు కోటపల్లి మండల బీజేపీ వైస్ ప్రెసిడెంట్ వడ్లకొండ రాజేష్ మండలం జనరల్ సెక్రటరీ పెద్దింటి లక్ష్మణ్ కొండగొర్ల రాజేందర్ కొల్లూర్ మాజీ సర్పంచ్ రాజగోడ్ ఉడుత రాజబాపు బీజేపీ మండల కార్యదర్శి సోషల్ మీడియా కో కన్వీనర్ శ్రవణ్ రాళ్లబండి స్వామి దుర్గం నర్సింహులు చంద్రయ్య, చిట్యాల మొండి ఎస్ టీ మోర్చా కోడిపే మహేష్,శ్రీశైలం,సాయి,రాకేష్ బాపు మరియు బీజేపీ కోటపల్లి మండల యూత్ ప్రెసిడెంట్ గారే రమేష్ బాబు సీనియర్ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్ వాడి కేంద్రాలపై దృష్టి పెట్టాలి

## అధికారులకు బాధితుల విజ్ఞప్తి

**పినపాక, మే 2 క్విక్ టుడే న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు ప్రముఖ ప్రాధాన్యత ఇచ్చారు. అంగన్వాడి సెంటర్లకు అన్ని రకాల పౌష్టిక ఆహారపు సామాగ్రి, పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులు పంపిణీ చేస్తూ నిరుపేద విద్యార్థులకు విద్యను అందించేందుకు అంగన్వాడీలు కృషి చేయాలనే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా అంగన్వాడి కేంద్రాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెలకొల్పాయి. అయితే ఇందుకు భిన్నంగా పలు ప్రాంతాలలో అంగన్వాడి కేంద్రాలు సక్రమంగా నడిపించుటకాని ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని పిల్లలకు అందించడం లేదని పలు విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి. మారుమూల ప్రాంతాల్లో అంగన్వాడి కేంద్రాలు ఉండటంతో పాటు సరైన క్షేత్రస్థాయి పరిశీలన పర్యవేక్షణ లేకపోవడంతో ఆడింది ఆట పాడిందే పాటగా అంగన్వాడి కేంద్రాల నిర్వహకులు ప్రవర్తిస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం కృష్ణ సాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాలలో జంగన్వాడీ కేంద్రాలు నామమాత్రం గానీ నడుస్తూ ఉన్నాయి పౌష్టికాహారం కూడా అందించడంలో నిర్లక్ష్యంతో పాటు వాటిని పక్కదారి పట్టిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. అంగన్వాడీ నిర్వాహకుల ప్రవర్తన పై ఎవరైనా ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం చెప్పడమే కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాట్లు చెప్పుకుంటున్నారు. పినపాక నియోజకవర్గం లో బూర్గంపాడు, కృష్ణ సాగర్, అశ్వాపురం, మణుగూరు, పినపాక అంగన్వాడీ నిర్వాహకుల పనితీరుపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే అక్కడ జరుగుతున్న పరిస్థితి అధికారులకు పూర్తిగా అర్థమవుతుందని పలువురు





కోరుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన పధకానికి తూట్లు పొడుస్తూ అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకుఇవ్వాల్సిన పౌష్టిక ఆహారా సామాగ్రిని స్వాహ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ప్రభుత్వ జీతాలు తీసుకుంటు కూడా పేద ప్రజల, పిల్లలకు విద్య, పౌష్టికాహారం అందించాల్సింది పోయి వారి పైన దురుసుగా ప్రవర్తించడం సిగ్గుచేటు. అలాగే బత్తుల నగర గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో రోజు కేవలం ఒకరిద్దరు పిల్లలు మాత్రమే హాజరవుతారని కానీ రిజిస్టర్ లో మాత్రం ఎక్కువ పిల్లలు, బాలింతలు హాజరవుతున్నట్లుగా లెక్కల్లో చూపిస్తుండడం గమనార్హం. వచ్చేది తక్కువ మంది పిల్లలు కానీ అందుకు సంబంధించిన వివరాల్లో మాత్రం పూర్తిస్థాయిలో విద్యార్థులు బాలింతలు హాజరవుతున్నట్టుగా పౌష్టికాహారం అందిస్తున్నట్లుగా వారు లెక్కల్లో చూపిస్తున్నారని విమర్శిస్తున్నారు. చుట్టుపక్కల ఎవరిని అడిగినా ఆ ప్రాంతంలో నిర్వాహకురాలు కొంచెం దురుసుదనంతో ఉంటుందని పలువురు ఆరోపించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని చేర వేయాలంటే క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పరిశీలన చేస్తూ మండలంలో ఉన్నటువంటి అంగన్వాడి కేంద్రాలను ప్రతి వారం పర్యవేక్షణ చేస్తూ పిల్లలకు బాలింతలకు చెందవలసిన పౌష్టికాహారాన్ని అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతూ ఇకనైన నిర్లక్ష్యంగా నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాల పై దృష్టి సారించి ప్రభుత్వ లక్ష్యాన్ని సఫలీకృతం చేసేలాగా చర్యలు తీసుకోవాలని పలువురు అధికారులను కోరుతున్నారు.

**త్వరలో.... నెల నెలా మాముల్లు.. .**

# పారదర్శకంగా ఈవీఎంల ర్యాండమైజేషన్

### మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజక వర్గ ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



**మేడ్చల్ మల్కాజిగిరి, క్విక్ టుడే న్యూస్ :** పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మల్కాజిగిరి నియోజకవర్గంలో 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున అదనంగా, బ్యాలెట్ యూనిట్ల యంత్రాల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని మల్కాజ్గిరి పార్లమెంటరీ నియోజక వర్గ ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ ఓ హరిప్రియ లతో కలసి జిల్లా ఎన్నికల అధికారి మల్కాజిగిరి జిల్లాలో మొదటి రాండమైజేషన్ లో 3029 బ్యాలెట్ యూనిట్లను కేటాయించడం జరగగా, నామినేషన్ల ప్రక్రియ అనంతరం 22 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున అదనంగా బ్యాలెట్ యూనిట్లు యంత్రాల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఈవిఎం యంత్రాల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామని అన్నారు. జిల్లాలోని మేడ్చల్ ,మల్కాజ్గిరి, కుకట్ పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఐదు నియోజకవర్గాలలో గల 2425 పోలింగ్ కేంద్రాలకు గాను ఆన్ లైన్ ద్వారా బ్యాలెట్ యూనిట్లు యంత్రాలను కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్న మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో 591 పోలింగ్ కేంద్రాలకు 738 బ్యాలెట్ యూనిట్లు, కేటాయించగా, మల్కాజ్గిరి నియోజకవర్గానికి 418 పోలింగ్ కేంద్రాలకు 522 బ్యాలెట్ యూనిట్లు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో 592 పోలింగ్ కేంద్రాలకు740 బ్యాలెట్ యూనిట్లు, కుకట్ పల్లి, నియోజకవర్గం పరిధిలో 417 పోలింగ్ కేంద్రాలకు 521 బ్యాలెట్ యూనిట్లు, , ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో 407 పోలింగ్ కేంద్రాలకు 508 బ్యాలెట్ యూనిట్లు, మొత్తం 3029 బ్యాలెట్ యూనిట్లు కేటాయించడం జరిగింది. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్ లైన్ విధానం ద్వారా పారదర్శకంగా ర్యాండంమై జేషన్ నిర్వహించి కేటాయించడం జరిగిందన్నారు. మొదటి సప్లమెంటరీ ర్యాండమైజేషన్ కు సంబంధించిన హర్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి - నూతన సమన్వయ కమిటీల ఏర్పాటు




**పీర్జాదిగూడ, క్విక్ టుడే న్యూస్ :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు బండారి రవీందర్ అధ్యక్షతన కార్పొరేటర్లు కౌడే పోచయ్య, దొంతిరి హరిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన సమన్వయ కమిటీల ఏర్పాటులో భాగంగా నిర్వహించిన సమావేశంలో 14వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాలొన్ని సమగ్రంగా చర్చించి 14వ డివిజన్ నూతన అధ్యక్షుడిగా జావీద్ ఖాన్ ను ఎన్నుకోవడం జరిగింది. కమిటీ సభ్యులుగా వైస్ ప్రెసిడెంట్ అక్కల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి మల్లం వెంకటేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద మల్లేష్, సలహాదారులు కర్రె కుమార్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి నగర పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతం చేయడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక తెలంగాణ సాధించి బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములమై,పార్టీకోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించి పార్టీ పునర్నిమానంలో మంచి అవకాశం కల్పించినందుకు మేయర్, పార్టీ అధ్యక్షకార్యదర్శులకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు, నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# వరదాయపల్లెలో టిడిపి ఎన్నికల ప్రచారం... పాల్గొన్న వీఆర్ వెంకటేశ్వర్ రెడ్డి



**తాడిపత్రి, మే 2, :** తాడిపత్రి మండల పరిధిలోనీ వరదాయ పల్లె గ్రామంలో టిడిపి నాయకుడు.వి ఆర్ .వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను విఆర్ వెంకటేశ్వర రెడ్డి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జయరాం రెడ్డి, సంజీవరెడ్డి, గోపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామాంజనేయులు, దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతల ఇంటింటి ప్రచారం




**మేడ్చల్ మల్కాజిగిరి, క్విక్ టుడే న్యూస్ :** మల్కాజిగిరి పార్లమెంట్ బీ.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ డివిజన్ కోనేటి వెంకట్ ఆధ్వర్యంలో సాయికృష్ణ, సాయి ఐశ్వర్య, సత్యనారాయణపురం, సాయి ప్రియా కాలనీలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, అధ్యక్షులు బండారి రవీందర్, కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పింగళి జోగి రెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొలిమిగుండ్లలో టిడిపి నుండి వైసీపీలోకి 150 కుటుంబాలు చేరిక




**కొలిమిగుండ్ల, మే 2, :** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో టిడిపి నుండి వైసీపీలోకి 150 కుటుంబాలు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రామిరెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని రానున్న ఎన్నికల్లో ప్రజలంతా కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైయస్సార్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డి,వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, పేరం ఆదిరెడ్డి, పేరం సూర్యనారాయణ రెడ్డి, వైసిపి యువ నాయకుడు పేరం నందకిషోర్ రెడ్డి, కోటపాడు ఈశ్వర్ రెడ్డి, కలవటాల తిమ్మారెడ్డి, గోపాల్ రెడ్డి, నందిపాడు సర్పంచ్ గురెడ్డి, రాఘవరెడ్డి, ఎర్రగుడి వెంకటేశ్వర రెడ్డి, ఎర్రగుడి కంబగిరి స్వామి, బెలుము మహేశ్వర్ రెడ్డి, బెలుము దస్తగిరి, పేరం రామశంకర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, మొలక రాజారెడ్డి, ఈశ్వరయ్య, కృష్ణారెడ్డి, కుమార్, సోమశేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగేందర్ రెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, పెద్దిరెడ్డి, లక్ష్మీరెడ్డి, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకోవాలని
# ఉప్పల్ స్టేడియంలో అవగాహన






**మేడ్చల్ క్విక్ టుడే న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్ పొట్రు వారి టీమ్ ఉప్పల్ స్టేడియంలో గురువారం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా స్టేడియం వచ్చే క్రికెట్ మ్యాచ్ వీక్షకులకు పార్లమెంటు ఎన్నికల స్వీప్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ స్టేడియం లోపల, బయట పాదచారులకు కనపడే విధంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు, స్టాండ్లు, బోర్డులు ఏర్పాటు చేయడం జరిగింది. స్వీప్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టీమ్ నోడల్ అధికారి మరియు సిబ్బంది స్టేడియం లోపల పలు ప్రాంతాలలో టీములుగా ఏర్పడి వారికి ఓటు పై అవగాహన కల్పించడంతోపాటు. దేశం కోసం ఓటు... నా మొదటి ఓటు దేశం కోసం.. ఓటు దేశ భవిష్యత్తు కోసం ఎన్నికల పర్వం దేశానికి గర్వం... అనే నినాదాలతో చైతన్య పరుస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగింది నూతన ఓటర్లు, యువతి యువకులు, మ్యాచ్ సందర్భంగా ఫ్లెక్సీల పై ఉన్న సమాచారంతో చూపర్లకు ఆకట్టుకునే విధంగా ఉన్నవి.. ప్రతి ఫ్లెక్సీ ఓట్లను చైతన్య పరచడంతో పాటు సమాజానికి ఒక మంచి మెసేజ్ అందించడంలో సఫలీకృతం అయినట్లుగా భావించవచ్చు.. స్టేడియం లో జరిగే క్రికెట్ మ్యాచ్ ను ఎన్నికల సందర్భంగా ప్రచారం కార్యక్రమం నిర్వహించడం పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# సిద్దిపేట గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరాలి

- ఇందిరా గాంధీ కృషి వల్లే మెదక్ కు పరిశ్రమలు
- బీసీ బిడ్డను ఆదరించండి
- సిద్దిపేట లో కాంగ్రెస్ కు లక్ష ఓట్ల మెజారిటీ పక్కా
- సీఎం రేవంత్ రెడ్డి
- ఢిల్లీ ప్రభుత్వాన్ని మార్చాలి : ప్రో. కోదండరాం
- బీసీ బిడ్డ భారీ మెజారిటీతోగెలుపొందడం ఖాయం
: జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ
- నిరంతరం అందుబాటులో ఉంటా : ఎంపీ అభ్యర్థి నీలం మధు
- సిద్దిపేట లో కాంగ్రెస్ రోడ్ షో
- కార్నర్ మీటింగ్ లో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి



**సిద్ధిపేట:**

సిద్దిపేట గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరాలని, అందుకు కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. గురువారం మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా సిద్దిపేట లో కాంగ్రెస్ రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కార్నర్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. ఇందిరా గాంధీ హయాంలో మెదక్‌కు అనేక పరిశ్రమలు కేటాయించారని, నెహ్రూ, ఇందిరాగాంధీ వల్లే మెదక్‌కు అనేక పరిశ్రమలు వచ్చాయన్నారు.







కార్యకర్తలందరూ సమన్వయంతో పని చేసి కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలన్నారు.

**ఢిల్లీ ప్రభుత్వాన్ని మార్చాలి ..**
**- ప్రో. కోదండరాం**

బీజేపీని ఎదురిస్తున్న పార్టీకి అభ్యర్థితో సంబంధం లేకుండా ప్రజలు ఓటేయాలని, ఈ సారి ఢిల్లీలో ప్రభుత్వాన్ని మార్చాలని ప్రో. కోదండరాం అన్నారు. మోడీ గ్యాస్ ధర పెంచితే కాంగ్రెస్ తగ్గించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే ప్రజలు ఆత్మగౌరవం తో బతుకుతారన్నారు. అందరూ హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ ను గెలిపించాలన్నారు.

**బీసీ బిడ్డను ఆదరించాలి...**
**- జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ**

మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీసీ బిడ్డ నీలం మధు ముదిరాజ్ ను ఆదరించాలని జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ కోరారు. ఎంపీ గా గెలిపిస్తే ఈ ప్రాంత సమస్యలను పరిష్కరిస్తాడని అన్నారు. బీఆర్ఎస్ ను ఓడిస్తేనే మనకు న్యాయం జరుగుతుందన్నారు.

**నిరంతరం అందుబాటులో ఉంటా...**
**- ఎంపీ అభ్యర్థి నీలం మధు**

మెదక్ ఎంపీగా గెలిపిస్తే ప్రజలందరికి నిరంతరం అందుబాటులో ఉంటానని ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. బీసీ బిడ్డకు టికెట్ కేటాయించినేందుకు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి అందుబాటులో ఉండరని, అది జిల్లా ప్రజలందరికి తెలుసన్నారు. కేంద్రం, రాష్ట్ర నిధులు తెచ్చి మెదక్ పార్లమెంట్ ని అగ్ర స్థానంలో నిలుపుతానని హామీనిచ్చారు. ఈ సారి కాంగ్రెస్ గెలవకపోతే మెదక్ జిల్లాలో శాశ్వత బానిసత్వం వస్తుందన్నారు. సిద్ధిపేటలో మీటింగ్ పెడితే ఎవరూ రారేమోనని మా నేతలు అన్నారు.. కానీ, ఈ జనాలను చూస్తే సిద్ధిపేటలో కాంగ్రెస్ కు లక్ష ఓట్ల మెజారిటీ రావడం ఖాయమని అనిపిస్తుందన్నారు. బీసీ బిడ్డ నీలం మధు గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి, నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ,చక్రధర్ గౌడ్,చిట్టి దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భవాని రెడ్డి,నాయిని నరసింహారెడ్డి, తాడూరి శ్రీనివాస్ గౌడ్, అత్తుఇమామ్,సతీష్ గౌడ్,గంప మహేందర్ రావు,గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి, సూర్య వర్మ,దరిపల్లి చంద్రం,బొమ్మల యాదగిరి, దాసరి రాజు, మీసం నాగరాజు,పూజల గోపి తదితరులు పాల్గొన్నారు.








# మండే ఎండలు

**- సుర్రుమనిపిస్తున్న సూరీడు - బయటికి రావాలంటే భయపడుతున్న ప్రజలు**

**హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండలు మండుతున్నాయి. రాత్రి తొమ్మిదైనా వేడి తగ్గడం లేదు. నిత్యం సాధారణం కంటే ఏడెనిమిది డిగ్రీలు ఎక్కువగా టెంపరేచర్లు నమోదవుతున్నాయి.తెలంగాణలోని 11 జిల్లాల్లో నిన్న 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో రాబోయే మూడు రోజులకుగానూ 12 జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. 46 డిగ్రీలకుపైగా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే ముప్పుందని తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, ములుగు, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్,



పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయని వెల్లడించింది. అలాగే, వడగాలులు కూడా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, నల్గొండ, కరీంనగర్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఆయా జిల్లాల్లోని అన్ని మండలాలూ రెడ్‌జోన్‌లోకి వెళ్లిపోయాయి. అక్కడ ఇప్పటికే 45 డిగ్రీల నుంచి 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు రికార్డ్అవుతున్నాయి. నిన్న నల్గొండ జిల్లా గుడాపూర్‌లో అత్యధికంగా 46.6 డిగ్రీల టెంపరేచర్?నమోదైంది. మంగపేట, మునగాల, చండూరు, భద్రాచలంలో 46.5 డిగ్రీలు, తిమ్మాపూర్, వైరా, ఖానాపూర్, వెల్గటూర్, ముత్తారంలో 46.4 డిగ్రీలు, కొమ్ములవంచలో 46.3... కల్లెడ, వీణవంక, జన్నారంలో 46.2 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో 9 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా, 7 జిల్లాల్లో 44 డిగ్రీలకుపైగా, 6 జిల్లాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డ్?అయ్యాయి.ఈ నెలలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని ఐఎండీ స్పెషల్ బులెటిన్‌లో వెల్లడించింది. అయితే, వడగాలుల వీచే రోజుల సంఖ్య మాత్రం తగ్గుతుందని తెలిపింది. రాష్ట్రంలో మే నెల మొత్తంగా సగటున నాలుగు రోజులు వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ఇటు వానలు కూడా పడే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. 1970 నుంచి 2020 వరకు మేలో నమోదైన సగటు వర్షపాతం ఆధారంగా.. ఈ నెలలోనూ సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

# త్వరలో ఖమ్మం కు రాహుల్ గాంధీ

**- ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో..బహిరంగ సభ**



**ఖమ్మం:** ఏఐసిసి అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రం పర్యటన ఖరారైంది. పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన రాష్ట్రం లో పలు జిల్లాలో పర్యటించనున్నారు. అందుకు సంబంధించిన ప్రకటన తేది ఖరారైంది. తెలంగాణ లో పార్లమెంట్ ఎన్నికల రాజకీయం రస వత్తరంగా మారింది. అభ్యర్థులతో పాటు కీలక నేతల ప్రచారాలతో రాజకీయ కాక రేగుతోంది.ప్రధాన పార్టీల నుంచి కీలక నేతలు రంగంలోకి దిగడం తో విమర్శలు, ప్రతివిమ ర్శలతో రాష్ట్రం వేడెక్కింది. ముఖ్యంగా జాతీయ పార్టీల నేతలు రాష్ట్రానికి వస్తుండ టంతో ప్రచారం మరింత ఊపందుకుంది.ఇప్పటికే మోదీ, అమిత్ షా, నడ్డా బీజేపీ తరఫున ప్రచారం చేశారు. ఇక కాంగ్రెస్ నుంచి కూడా జాతీయ నేతలు రంగంలోకి దిగుతున్నారు.ఇందులో భాగంగానే లోక్ సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల రాష్ట్ర పర్యటన ఖరారైనట్లు పీసీసీ వర్గాలు వెల్లడిం చాయి.ఈనెల 5వ తేదీన రాహుల్ గాంధీ నిర్మల్, గద్వాల్ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థు లకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తారని ఈనెల 9వ తేదీన కరీంనగ ర్, సరూర్ నగర్, ప్రచారం చేయనున్నారు. ఈ నెల 6,7వ తేదీల్లో ప్రియాంక గాంధీ రాష్ట్రానికి రానున్నా రు. 6వ తేదీన ఎల్లారెడ్డి, తాండూర్, సికింద్రాబాద్ ఎన్నికల ప్రచార సభలకు, 7వ తేదీన నర్సాపూర్, కూకట్పల్లిలో ప్రియాంక ప్రచారం చేయనున్నారు.

# ఖమ్మంలో ఆర్ఆర్ఆర్ రోడ్ షో

**- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రేణుకా చౌదరి**



**ఖమ్మం :** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ఈనెల మూడవ తేదీన శుక్రవారం ఖమ్మం నగరంలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ రోడ్ షోలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి తదితర ముఖ్యనేతలు పాల్గొంటారు. సాయంత్రం ఐదుగంటలకు మొదలయ్యే ఈరోడ్ షో జెడ్పీసెంటర్ మీదుగా బోనకల్ క్రాస్ రోడ్, ముస్తఫానగర్ నుంచి చర్చికాంపౌండ్ చేరుకుంటుంది. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారు. అనంతరం అక్కడ నుంచి శ్రీనివాసనగర్ అయ్యప్పస్వామి టెంపుల్ మీదుగా బోస్ బొమ్మ సెంటర్, రాజీవ్ చౌక్ నుంచి గాంధీచౌక్ చేరుకుటుంది. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారు. ఈ మేరకు టూర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తుంబూరు దయాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

# ఉద్యోగుల జీవితాలతో చెలగాటం

## - కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దుపై మౌనం - ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని వైనం

**న్యూఢిల్లీ,మే2:** కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) రద్దు కోరుతూ ప్రభుత్వోద్యోగులు ఉద్యమం దేశవ్యాప్తంగా ఆందోళనచేస్తున్నా పట్టించుకోని మొద్దు నిద్రలో ప్రభుత్వాలు ఉన్నాయి. ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు పెన్షన్లు తీసుకుంటున్న పాలకులు ఉద్యోగులను మాత్రం రోడ్డున పడేశారు. దీనిపై ఈ ఎన్నికల్లో ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉద్యోగులకు లేని పెన్షన్ రాజకీయ నాయకులకు ఎందుకన్న ఆలోచన చేయాలి. దీనిపై నేతలను నిలదీయాలి. ఈ సమస్యకు పరిష్కారం కనుగొని ఉంటే బాగుండేది. ఇందులో టీచర్లు కూడా ఉన్నారు.

దేశానికి దిశానిర్దేశం చేస్తున్న టీచర్లకు మన్నశ్శాంతి లేకుండా పాఠాలు చెప్పడం సాధ్యమా అన్నది ఆలోచన చేయాలి. 2004 జనవరి 1 నుంచి నూతన పెన్షన్ పథకం పేరుతో సిపిఎస్‌ను అమల్లోకి తెచ్చింది. అనంతరం యుపిఎ-1 సర్కారు పిఎఫ్‌ఆర్‌డిఎకి చట్టబద్ధత కల్పించారు. ప్రజాప్రతినిధులకు పెన్షన్లు, సౌకర్యాలు కల్పించుకుంటున్న దశలోఉద్యోగులు పట్ల నిర్దయగా వ్యవహరించడం ఎంతవరకు సమంజమో ఆలోచన చేయడం లేదు. సిపిఎస్ రద్దు కోరుతూ అఖిల భారత స్థాయిలో ఇప్పటికే తీవ్రస్థాయిలో సమ్మెలు జరిగాయి. సిపిఎస్ పరిధిలో దేశ వ్యాప్తంగా 56 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో ఐక్య ఉద్యమాలు జోరందుకున్నాయి. వివిధ స్థాయిల్లో ధర్నాలు, సదస్సులు, చలో అసెంబ్లీ తదితర రూపాల్లో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలు తమ భవిష్యత్తుపై ప్రభుత్వాన్ని నిలదీస్తు న్నాయి. ఉద్యోగులు రిటైరయ్యాక గౌరవ ప్రదంగా కనీస జీవనం సాగించడానికి ప్రభుత్వాలు పూచీ పడటం కనీస ధర్మం. సుప్రీం కోర్టు సైతం అదే చెప్పింది. పెన్షన్ అనేది సామాజిక భద్రతాంశం. ఖజానాకు భారం అన్న పేరుతో దాన్ని ప్రభుత్వాలు వదిలించు కోవాలను కోవడం సరికాదు. ఉద్యోగుల ఆందోళనల ఫలితంగా కేంద్రం గ్రాట్యుటి ఉత్తర్వులిచ్చింది. ఎపి సైతం గ్రాట్యుటి, కుటుంబ పెన్షన్‌కు అవకాశం కల్పించినా ఉద్యోగులు దాచుకున్న మొత్తాన్నీ తిరిగి ఇవ్వాలని మెలిక పెట్టింది.

సిపిఎస్ రద్దు కోసం ఉద్యోగులు ఐక్య ఉద్యమాలు నిర్మించినప్పుడే ప్రభుత్వాలు దిగి వస్తాయని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇరు రాజధానుల్లో వరుసగా నిరసన ప్రదర్శనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం తప్ప చేసిందేమీ లేదు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పోరాటాలు అణచివేయడం తప్ప సమ్మెలను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. వీంతా బలమైన ఐక్యసంఘటనలుగా ఏర్పడి పోరాడుతూనే ఉన్నారు. సిపిఎస్ అమల్లోకొచ్చి దశాబ్దంన్నర కావస్తోంది. ప్రస్తుతం ఎపిలో అధికార, ప్రతిపక్షాలుగా ఉన్న టిడిపి, వైసిపిలు దానికి అనుకూలంగా నిలిచాయి. 2004 సెప్టెంబర్ నుంచే ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం తెచ్చి మరీ సిపిఎస్‌ను అమల్లో పెట్టింది. వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళ, త్రిపుర, బెంగాల్‌లో మాత్రమే అప్పుడు సిపిఎస్ అమలు కాలేదు. సిపిఎస్ అనేది ఉద్యోగులకు ఏ మాత్రం భరోసా లేని గందరగోళ వ్యవహారం. ఉద్యోగుల జీతాల్లో నెలకు పదిశాతం మినహాయించుకొని అంతే మొత్తంలో ప్రభుత్వం తన వాటాను జత చేస్తుంది. వాటితో ఉద్యోగులు రిటైరయ్యాక పెన్షన్ ఇస్తారు. పెన్షన్ ఎంత వస్తుందో తెలీదు. కనీస సమాచారం ఇచ్చే కార్యాలయం రాష్ట్రంలో లేదు. పైపెచ్చు సిపిఎస్ నిధులను షేర్ మార్కెట్‌లో పెడతారని సమచారం. ప్రపంచ ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ఏ క్షణం షేర్ మార్కెట్ పుంజుకుంటుందో ఏ క్షణం కుప్పకూలుతుందో తెలీదు. రిటైరయ్యాక ఉద్యోగులు దాచుకున్న సొమ్మును తీసుకోవాలంటే 30 శాతం ఆదాయపన్ను కట్టాలనడం మరీ దారుణం. సిపిఎస్ పర్యవసానాలు ఇంత ఘోరంగా ఉన్నందునే ఉద్యోగుల్లో అంతకంతకూ ఆందోళనలు పెల్లుబుకుతున్నాయి. వీటిపై దృష్టి సారించి ఓ నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదే.

# హత్యా నిందితుడికే మళ్లీ పట్టంకడదామా

## - వివేకాను చంపిదెంవరో అందరికీ తెలుసు

## - జగన్ హంతకుడికే అండగా ఉంటే ఎలా - ప్రచారంలో వైఎస్ షర్మిల ప్రశ్నలు



**కడప,మే2:** ఎన్నికల ప్రచారంలో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల దూసుకెళ్తున్నారు. తన సోదరుడు, సీఎం జగన్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. పెద్దముడియం మండలం సుద్దపల్లి గ్రామం నుంచి గురువారం ప్రచారం ప్రారంభించారు. రాముడికి లక్ష్మణుడు ఎలాగో తన తండ్రి వైఎస్‌ఆర్‌కు వివేకా అలా ఉండేవారని వివరించారు. హత్యా నిందితుడికి మళ్ళీ ఎందుకు పట్టం కట్టాలని వైఎస్.షర్మిల ప్రశ్నించారు. గురువారం కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో ఏపిసిసి చీఫ్, కడప ఎంపి అభ్యర్థి వైఎస్ షర్మిలా రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దముడియం మండలం సుద్దపల్లి గ్రామం నుంచి ప్రచారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వైఎస్.షర్మిలా రెడ్డి మాట్లాడుతూ రాముడికి లక్ష్మణుడు ఎలాగో వైఎస్‌ఆర్ కి వివేకా అలా ఉండేవారని చెప్పారు. వివేకా చనిపోయి 5 ఏళ్లు అయ్యిందని.. ఆయన్ను చంపేశారు..హత్య చేశారు అని, గొడ్డలితో 7 సార్లు అతి క్రూరంగా నరికి హత్య చేశారని తెలిపారు. ఎముకలు, మెదడు బయటకు వచ్చేలా నరికి చంపారని, ఎవరు చంపారో అందరికీ తెలుసునని అన్నారు. సిబిఐ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. అవినాష్ రెడ్డి నిందితుడు అని అన్ని సాక్ష్యాలు ఉన్నాయన్నారు. ఇవి తాము చెబుతున్నది కాదు అని, సిబిఐ దగ్గర ఉన్న ఆధారాలు అని చెప్పారు. చంపించిన వారికి, చంపిన వారికి ఈరోజుకి శిక్ష లేదని, చనిపోయింది వైఎస్‌ఆర్ తమ్ముడు అని అన్నారు. హంతకులను కాపాడుతున్నది జగన్ మోహన్ రెడ్డి అని దుయ్యబట్టారు. అవినాష్ రెడ్డిని అరెస్టు చేయాలని చూస్తే కర్నూల్ లో కర్ఫ్యూ పెట్టారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అరెస్ట్ కాకుండా జగన్ రెడ్డి అడ్డం పడ్డారని ఆరోపించారు. ఎందుకు హంతకులను వెనకేసుకు వస్తున్నారు జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని షర్మిల అడిగారు. హత్య జరిగినప్పుడు సిబిఐ విచారణ కావాలని అడిగారనీ.. అధికారంలో వచ్చాక సిబిఐ విచారణ వద్దు అన్నారని ? సిబిఐ విచారణ అంటే జగన్ ఎందుకు భయపడుతున్నారు ? అని ప్రశ్నించారు.

హత్యా నిందితుడికి మళ్ళీ ఎందుకు పట్టం కడుతున్నారు ? అని అడిగారు. అధికారం అడ్డుపెట్టా అవినాష్ రెడ్డిని కాపాడుతున్నారు ? ఇది అన్యాయం.. అక్రమం.. ఇది అధర్మం? అని అన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు తాను నిలబడ్డానన్నారు. తాను వైఎస్‌ఆర్ బిడ్డనని, దేనికి భయపడను అని, న్యాయం వైపు తాను నిలబడ్డానని షర్మిల స్పష్టం చేశారు.కొంగుచాచి న్యాయం అడుగుతున్నాం. మీరు న్యాయం వైపు నిలబడతారని అనుకుంటున్న. నేను మీ బలం, నేను మీ గొంతు. మీ బిడ్డగా ఇక్కడే ఉంటా. మీ కోసమే నా జీవితం అంకితం. న్యాయం కోసం ప్రతి ఒక్కరినీ ప్రార్థిస్తున్నా. దయచేసి తమకు న్యాయం చేయాలని ప్రజలను' వైఎస్ షర్మిల కోరారు.

# ఐదేళ్లల్లో ఇరవై లక్షల ఉద్యోగాల కల్పన

## - ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తాం - విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్ధి కేశినేని శివనాథ్

**విజయవాడ,మే2:**కూటమి పార్టీల అభ్యర్థులకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ తెలిపారు. ఉపాధి, ఉద్యోగాలు, అభివృద్ధి కావాలంటే చంద్రబాబు రావాలని కోరుకుంటున్నారన్నారు. ఐదేళ్లల్లో ఇరవై లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. గత ఐదేళ్లల్లో ఉద్యోగాలు లేక యువత భవిష్యత్తు నాశనం అయ్యిందని విమర్శించారు. డిగ్రీలు, పిజీలు చేసినా పొట్ట చేత పట్టుకుని వలస వెళ్లారన్నారు. కొంతమంది గంజాయి వంటి దురలవాట్లకు బానిసగా మారుతున్నారన్నారు. టీడీపీ నేత నారా లోకేష్ ఇప్పటికే దీనిపై కార్యాచరణ సిద్ధం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి, ఇరవై లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతారని హామీ ఇచ్చారు. ఎన్‌ఆర్‌ఐ వింగ్ తరపున కూడా లక్ష ఉద్యోగాలు ఇస్తామన్నారు. కూటమి పార్టీల తరపున చంద్రబాబు ప్రకటించిన మ్యానిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. జగన్ కోడి కత్తి డ్రామా ఆడాడు నాడు ప్రజలు నమ్మారు. ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడాడు... ప్రజలు చీదరించుకున్నారు. అన్నిసార్లు ప్రజలను మోసం చేయాలంటే సాధ్యం కాదు' అంటూ సెటైరికల్ కామెంట్స్ చేశారు. ఎన్నికల హామీలు ఇవ్వకుండా ఐదేళ్లల్లో మోసం చేస్తూనే ఉన్నారన్నారు. వైసీపీ ప్రచారం నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని తెలిపారు.

చంద్రబాబు క్రైసిస్ మేనేజర్ అని... సంక్షోభ పరిస్థితిలో కూడా సంపద సృష్టించ గలరన్నారు. 200 నుంచి 2000 పెన్షన్ పెంచిన చరిత్ర చంద్రబాబు ది అని చెప్పుకొచ్చారు.నవరత్నాలు పేరుతో ప్రజలను మోసం చేసిన చరిత్ర జగన్ ది అని అన్నారు. మద్య నిషేధం అన్న జగన్... కల్తీ మద్యం వ్యాపారిగా మారారని తెలిపారు. నాసిరకం మద్యం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆన్‌లైన్ కాకుండా నగదు మాత్రమే తీసుకుని దోచుకున్నారని ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో టీడీపీ చాలా బలంగా ఉందని... కూటమి తరపున బీజేపీ, జనసేన తోడు అయ్యాయన్నారు. మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలయిక రాష్ట్ర దశ దిశ మారుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పేదలకు వైద్య సేవలు ఉచితంగా అందిస్తారన్నారు. ప్రజల సొంతింటి కలను చంద్రబాబు సాకారం చేస్తారన్నారు. విజయవాడలో ప్రధాని మోదీ రోడ్ షో నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. అన్నివిధాలా విజయవంతం చేసేలా కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఏపీలో ఉన్న ప్రధాన సమస్యలను మోదీ దృష్టి కి తీసుకెళ్లి వివరిస్తామని అన్నారు.

విజయవాడ పార్లమెంటు పరిధిలో ఉన్న ఇబ్బందుల పరిష్కారం కోసం నిధులు కేటాయించాలని కోరతామన్నారు. ప్రజలంతా కూటమి విజయం కోరుతున్నారన్నారు. చంద్రబాబు సీఎంగా అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రజలే ధీమాగా చెబుతున్నారని కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# పెన్షన్ల కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు

## ఖాతాల్లో పడకపోవడంతో ఆందోళన

**విజయవాడ,మే2:** పెన్షనర్ల విషయంలో ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మే 1 నుంచి మూడు రోజుల పాటు పెన్షన్లు పంపిణీ చేస్తామంటూ ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం మేడే బ్యాంకులకు సెలవు కావడంతో ఈరోజు ఉదయం నుంచి బ్యాంకుల వద్దకు పెన్షనర్లు చేరుకున్నారు. పెన్షన్ల కోసం బ్యాంకుల వద్ద పెన్షన్‌దారులు పడిగాపులు కాస్తున్నారు. తీరా పెన్షన్లు పొందే క్రమంలో బ్యాంకు అధికారులు చెబుతున్న రూల్స్‌తో పింఛన్‌దారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వృద్ధులు, వికలాంగులు బ్యాంకులకు వచ్చి పెన్షన్లు తీసుకునే క్రమంలో బ్యాంకు అకౌంటు రన్నింగ్‌లో లేదని బ్యాంక్ యాజమాన్యం చెబుతోంది. బ్యాంకు అకౌంటు రన్నింగ్‌లో పెట్టుకోవాలంటే ఆధార్ జిరాక్స్, పాన్ జిరాక్స్, బ్యాంకు వాళ్ళు ఇచ్చిన అప్లికేషన్ ఫిలప్



చేసి ఇవ్వాలని బ్యాంక్ సిబ్బంది రూల్స్ పెట్టారు. ఇవి రెండు ఇస్తేనే అకౌంట్ ఆపరేషన్‌లోకి వస్తుందని బ్యాంక్ సిబ్బంది చెబుతున్నారు. ఈరోజు సాయంత్రం అకౌంట్‌ఆపరేషన్‌లోకి వస్తుందని, రేపు వచ్చి డబ్బులు తీసుకోవాలని బ్యాంక్ అధికారులు తెలిపారు. అయితే కొందరు పెన్షనర్లకు అసలు పాన్‌కార్డు అంటే ఏంటో కూడా తెలియని పరిస్థితి. చదువురాని తమని ఇంత ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ వృద్ధులు కన్నీరు పెట్టుకుంటున్నారు. తమను ఇలా ఎన్ని రోజులు ఎండల్లో తిప్పుతారని పెన్షన్‌దారులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బ్యాంక?ల వద్ద పెన్షన్‌దారులు ఎదురుచూపులు చూస్తున్నారు. మారుమూల గ్రామాల్లో బ్యాంక్ శాఖలు లేకపోవడంతో మండల కేంద్రాల్లోని బ్యాంక్‌లకు ఆటోలు, బస్‌లలో పెన్షన్‌దారులు చేరుకుంటున్నారు. కాగా.. రాష్ట్రంలో 48 లక్షల 96 వేల మంది పెన్షన్ దారులకు బ్యాంక్ అకౌంట్‌లు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది.

# మండుటెండలతో జనం ఉక్కిరిబిక్కిరి

### ఉపాధి,నిత్యకూలీలకు తప్పని యాతన

### జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పు తప్పదు

**ఆదిలాబాద్,మే2:** భానుడి ఉగ్రరూపంతో ప్రజలు తల్లడిల్లుతున్నారు. గత వారం రోజుల కంటే ఉమ్మడి జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా ప్రజలు ఉక్కపోతతో తల్లడిల్లుతున్నారు. ఎన్నికల కాలం కావడంతో ప్రజలు బయటకు రావాల్సి వస్తోంది. నేతలు కూడా అపసోపాలు పడుతున్నారు. ఈ క్రమంలో ఉదయం 9గంటల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. సాయంత్రం వరకూ వడగాల్పులు వీచడంతో తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. రోజురోజుకు సూర్యుడు ప్రతాపం చూపడంతో రహదారులు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి.తీవ్రమైన ఎండ, వేడి గాలులు వీచినప్పుడు వడదెబ్బ సోకుతోంది. శరీర ఉష్ణోగ్రత పెరగడంతో తలనొప్పి వస్తోంది. నాడి వేగంగా కొట్టుకోవడం నాలుక ఎండి పోవడం శరీరంలో నీటి శాతం కోల్పోవడం, పాక్షిక, లేదా పూర్తిగా అపస్మారకం చేరడం వంటి లక్షణాలు కలిగి ఉంటే వడదెబ్బ సోకినట్లుగా గుర్తించవచ్చు. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో తిరగటం, పని చేయడం, ఆడటం చేయరాదు. తప్పని పరిస్థితిల్లో వెళ్లాల్సి వస్తే తలపై టోపి, గొడుగు, తెల్లని వస్త్రం కప్పుకోవాలి. తెల్లని నూలు వస్త్రాలు మాత్రమే ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవి ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు తొమ్మిదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఏప్రిల్‌లోనే ఈవిధంగా ఉంటే రానున్న మేలో ఏ విధంగా ఎండలు మండుతాయోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. అయితే వేసవి ప్రారంభంలోనే విపత్తుల నిర్వహణపై అధికారులతో పాలనాధికారి సమావేశం నిర్వహించి రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో వడదెబ్బ నుంచి నివారణ చర్యలు, జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నది. రానురాను ఎండలు ముదరడంతో భూగర్భ జలాలు అడుగంటడంతో బోరుబావుల్లో నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇక పొట్ట కూటి కోసం రెక్కలు ముక్కలు చేసుకునే కూలీలు వడదెబ్బతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా శ్రమించడంతో వారు ప్రాణం మీదకు తెచ్చుకోవాల్సి వస్తోంది. వడదెబ్బపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని ప్రణాళిక రూపొందించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో మినహాయిస్తే మధ్యాహ్నం వేళల్లో వీలైనంత వరకు నీడ పట్టునే ఉంటే మంచిదన్న అభిప్రాయంతోపాటు ఏ గ్రామంలోనైనా వడదెబ్బతో మృతిచెందినా, ఇతర ఏ కారణంతో మరణించినా తక్షణమే వీఆర్‌ఏ సమాచారం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. ఏగ్రామంలో నీటి సమస్య ఉంటే ఆయా గ్రామాల్లో నోడల్ అధికారిని భర్తీ చేసుకుని అతని ద్వారా ఆయా సమస్యలను తీర్చుకునేలా ప్రతి అవాసానికి వీఆర్‌ఏకు బాధ్యతలు అప్పగించారు. అయితే మంచినీటి ఎద్దడి నివారణ సమస్యలు కాస్తా పరిష్కారానికి చర్యలు చేపట్టినా, క్షేత్ర స్థాయిలో వడదెబ్బపై ప్రచారం పూర్తిగా చేపట్టడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, నీడ సౌకర్యాలు కల్పించలేదు. ఇప్పటినుంచి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అడ్డుకట్టకు కృషి చేయాల్సిన అవసరం ఆయాశాఖల అధికారులపై ఎంతైనా ఉంది.

# రారెత్తిస్తున్న ఎండలతో ప్రజల బెంబేలు

### జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

**నిజామాబాద్,మే2** జిల్లాలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాదాపు 42డిగ్రీలకుఎ చేరువలో నమోదు అవుతున్నాయి. దీంతో ప్రజలు బయటకురావడానికే జంకుతున్నారు. వేడి, ఉక్కపోత ఉండటంతో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎండవేడిమితో అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పని నిమిత్తం ఎండలో బయట వెళ్లినప్పుడు తప్పనిసరిగా రక్షణ కవచాలు ధరించాలని, కళ్లకు రక్షణగా కళ్లద్దాలు, నెత్తిన టోపీ, వేడిగాల్పుల నుంచి చెవులు, ముక్కుకు రక్షణగా రుమాలు కట్టుకోవాలని చెబుతున్నారు. వడదెబ్బ తగలకుండా ఎక్కువ నీరును విడతల వారీగా తాగాలని, పుచ్చకాయలు, కొబ్బరినీళ్లు, పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఓఆర్‌ఎస్ పొట్లాలు దగ్గర ఉంచుకుంటే ఉత్తమం. వృద్ధులు, గర్భిణులు, బాలలు ఎండలో వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతో చాలామంది తమ పనులు వాయిదా వేసుకుంటున్నారు. ఎండ లేని సమయంలో అంటే ఉదయం 9 లోపు, సాయంత్రం 6 తర్వాత తమ పనులు చేసుకోవడానికి ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. ఎప్రిల్‌లోనే మండుతున్న ఎండలు మే నాటికి ఎలా ఉంటాయోనన్న భయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. వచ్చే వారంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మేరకు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లినా ఎండ వేడి నుంచి తట్టుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మే నెలలో వడగాల్పులు ఎక్కువగా వీచే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. తీవ్రమైన ఎండలతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారి ఎడారిని తలపింపజేస్తున్నాయి. కోల్‌బెల్ట్ ఏరియాలు ఎండలు మండుతున్నాయి. రామగుండం, పెద్దపల్లి, గోదావరిఖని తదితర ప్రాంతాల్లో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం ఎనిమిది దాటితేనే ఎండలు భగ్గుమంటున్నాయి.. నాలుగు రోజులుగా భానుడు తీవ్రరూపం దాల్చుతున్నాడు.. పది దాటితే బయటికి వెళ్లాలంటేనే జనాలు జంకుతున్నారు. దీంతో ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్యాహ్నం వేళ ప్రధాన రోడ్లన్నీ నిర్మాణుష్యంగా మారుతున్నాయి. మున్ముందు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను దాటుతున్నాయి. రోజంతా భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో సాయంత్రం 6 గంటల వరకు వేడి గాలులు వీస్తున్నాయి. గత నాలుగు రోజులుగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ముఖ్యంగా వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతుండడంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్నాయి. అనునిత్యం రద్దీగా ఉండే టవర్‌సర్కిల్‌తో పాటు, ఇతర ప్రాంతాలు వెలవెలబోతున్నాయి.

# లిక్కర్ కేసులో కవితకు మరోమారు నిరాశ

### బెయిల్ తీర్పు మే 6కు వాయిదా



**న్యూఢిల్లీ,మే2:** దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. సీబీఐ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పును మే 6కి వాయిదా వేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పును మే 6న వెలువరిస్తామని జడ్జి కావేరి బవేజా గురువారం ప్రకటించారు. కాగా ఇదివరకే కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా పడింది. ఏప్రిల్ 22న తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. గురువారం జైలా లేదా బెయిలా అనేది తేలుతుందని అంతా భావించారు. కానీ కవితను నిరాశకు గురిచేస్తూ తీర్పును మరోసారి కోర్టు వాయిదా వేసింది.మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలని, అరెస్ట్ నుంచి విచారణ వరకు కవితకు వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవని వాదనలు కవిత తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. బీఆర్‌ఎస్ పార్టీకి స్టార్ క్యాంపైనర్‌గా ఉన్నందున ఎన్నికల్లో ప్రచారం కోసం బెయిల్ ఇవ్వాలని కవిత కోరారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసులకు అరెస్ట్ అవసరం లేదని, కవిత అరెస్టుకు సరైన కారణాలు లేవని, మహిళగా ఆరోగ్యపరమైన కారణాలు పరిగణలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలని కవిత న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. లిక్కర్ కేసులో కవిత కీలక వ్యక్తిగా ఉన్నారని సీబీఐ తరపు లాయర్లు వాదించారు. ఈ కేసుకు సంబంధించి చాలా విషయాలు కవితకు తెలుసునని, ఇతరులు ఇచ్చిన స్టేట్‌మెంట్స్, ఆధారాలపై ఆమెను విచారించినా నిజాలు చెప్పడం లేదని కోర్టుకు సీబీఐ న్యాయవాదులు తెలిపారు.

# విద్వేష రాజకీయాలు సరికాదు !

అన్ని పార్టీలది ఒకటే దారి. ఎన్నికల్లో ఓట్లు సంపాదించడం కోసం ఎదుటిపార్టీలపై బురదజల్లడం. లేని ఆరోపణలు చేయడం. విద్వేష ప్రసంగాలు చేయడం. ఈ కారణంగానే కెసిఆర్‌పై ఎన్నికల సంఘం 48 గంటల ప్రచార నిషేధం విధించింది. నిజానికి విద్వేష ప్రసంగాలు చేసే నాయకుడు ఎవరైనా నిషేధం విధించాలి. ఎన్నికల్లో తమ పార్టీ విధానాలు, ప్రజలకు ఏం చేయబోతున్నమో చెప్పాలే తప్ప..విద్వేష, అనవసర అపోహలు కలిగించే ప్రయత్నాలు చేయడం సరికాదు. ఇందులో రాజ్యాంగ సవరణ, రిజర్వేషన్ల రద్దు, వారసత్వ హక్కులపై పన్ను,ఎపిలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటి ఎన్నో అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఇవన్నీ కూడా ఎన్నికల్లో లబ్ది పొందేందుకు, ఎదుటి పక్షాన్ని ఇరకాటంలో పెట్టడానికి మాత్రమే పనికి వస్తాయి. ఇవేవీ అంత సులువుగా కార్యరూపం దాల్చే అంశాలు కావు. నిజానికి ప్రజలు ఎదుర్కొంటున్న ఏ సమస్యా కూడా ప్రచారంలో ప్రస్తావనకు రావడం లేదు. ప్రజల సమస్యలను విడిచి రాజకీయ పార్టీలు అధికారమే లక్ష్యంగా ఎన్నికల ఎజెండాను సెట్ చేస్తున్నారు. ఈ ప్రమాదాన్ని ప్రజలు గుర్తించాలి. ఇకపోతే కేవలం బిజెపి హిందుత్వాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పడం ద్వారా మైనార్టీ ఓట్ల కోసం వెంపర్లాడే బుజ్జగింపు రాజకీయాలను అన్ని పార్టీలు దూరం పెట్టాలి. నిజానికి మైనార్టీల సంతుష్టీ కరణతో విభజన రేఖలు గీస్తున్నది రాజకీయ పార్టీలే. ఇలా చేసే దేశ విభజన జరిగిందన్న విషయాన్ని మరచి పోరాదు. ఏ వర్గాన్నయినా మచ్చిక చేసుకునే క్రమంలో భ్రమలు కల్పించే ప్రయత్నాలు ఎవరు చేసినా నేరంగానే చూడాలి. అన్ని వర్గాలను సమానంగా చూసే రాజకీయాలు దేశానికి అవసరం. ఇప్పటికే మత ప్రాతిపదికన దేశం విచ్చిన్నం అయ్యింది. విభజన జరిగింది. ఈ క్రమంలో సమాజంలో జరుగుతున్న అకృత్యాలను ఎవరు చేసినా..చేపట్టినా నిర్ద్వందంగా ఖండించాల్సిందే. అఘాయిత్యాలను ఎత్తిచూపాల్సిందే. మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూసే దుస్థితి పోవాలి. వారిని ఈ దేశ సంస్కృతిలో భాగంగా చూడాలి. బిసిలు, నిమ్న కులాలను కూడా జనజీవన స్రవంతిలి కలిసి పోయేలా చూడాలే తప్ప వారిని వేరుగా చేసి చూసే రాజకీయాలను తిప్పికొట్టాలి. అలాగే సమస్యలను అజెండాగా చేసుకుని పోరాడితే తప్ప ప్రజలు నమ్మరని గుర్తించాలి. ప్రధానంగా



ఈ దేశంలో కమ్యూనిస్టులు ఇంకా మేల్కోవడం లేదు. పడికట్టు పదాలతో ప్రజలను భ్రమల్లో పెట్టి రాజకీయ పబ్బం గడపాలనుకోవడం తప్పుకాక మరోటి కాదు. ప్రజల్లో ఐక్యతా నినాదాన్ని తీసుకుని రావాలి. కలసి పనిచేయాలన్న సంకల్పంతో ముందుకు సాగితే తప్ప ప్రజలు నమ్మరు. సమస్యపై పోరాటం ప్రాతిపదికగా కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలి. అంతేగాని హిందుత్వ పేరుతో రాజకీయాలు చేయడం మానాలి. పార్లమెంట్ ఎన్నికలు లక్ష్యంగా రాజకీయ పార్టీలు చేస్తున్న విన్యాసాలు, ప్రకటనలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు జుగుప్స కలిగిస్తున్నాయి. ఈ రకమైన భావజాలంతో ముందుకు సాగితే విపరీత పరిణామాలు రావచ్చు. భారతదేశంలో మాత్రమే ప్రజలంతా కలసిమెలసి జీవించే విధంగా ముందుకు సాగుతున్నారు.ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం అవసరం.

అందుకు పార్టీలు విభేదాలు పక్కకు పెట్టి సమస్యలను ఎజెండాగా చేసుకుని ముందుకు సాగాలి. భాజపా వ్యతిరేక గళాలు ఒకేతాటి మీదికి రావాలన్న ఆకాంక్ష బలంగా వినిపిస్తున్నా కార్యరూపంలోకి రావడం లేదు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులు, మేధావులు, సిద్ధాంత కర్తలు, మైనారిటీలు, దళితులందరూ ఒకే వేదిక మీదకు రావడంపై తక్షణం దృష్టిపెట్టాల్సి ఉంది. ఎంతసేపు ఆర్‌ఎస్‌ఎస్ చేతుల్లో కేంద్రం కీలుబొమ్మ గా మారిందనీ..మోదీ సర్కారు నియంతృత్వ విధానాలను అవలంబిస్తోందని, హిందుత్వ విధానాలు అవలంబిస్తోందని దుయ్యబడుతున్న తీరు సరికాదు. సమస్యలపై నిలదీయాల్సిన పార్టీలు, లేదా నేతలు రాజకీయ స్వలాభం కోసం బట్టకాల్చి మీద వేసే ప్రయత్నాలు మానుకోవాలి. మతోన్మాదం విషయంలో లెఫ్ట్ రెండు నాల్కల ధోరణిని విడనాడాలి. హిందువులు ఏదైనా చేస్తే దానిని తీవ్రంగా పరిగణించి హిందూ మతోన్మాదం అన్న ముద్ర వేస్తున్నారు. ముస్లిం తీవ్రవాదాన్ని మాత్రం గట్టిగా ఖండించడంలో నాలుకలు మడతపడేస్తున్నారు. ఈ జాడ్యం నుంచి వారు బయటపడక పోవడంతో హిందువుల్లో ఆయా పార్టీల పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇస్లామిక్ టెర్రరిజం విషయంలో కఠినంగా ఉండాల్సిందే. మతోన్మాద రాజకీయాలను భాజపా సర్కారు ప్రోత్సహి స్తోందని.. గత తొమ్మిళ్లలో మహిళలు, దళితులు, మైనారిటీలపై దాడులు విపరీతంగా పెరిగి పోయాయని అంటున్న వారు ఐఎస్ ఉగ్రవాదుల ఊచకోతను తీవ్రంగా వ్యతిరేకించి అందుకు అనుగుణంగా ఉద్యమించ లేకపోతున్నారు. ఇవన్నీ పక్కన పెట్టి దేశంలో లేని సమస్యలను ఎజెండాగా చేసి ప్రచారం చేయడంలో రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. ఈ జాడ్యం నుంచి బయటపడాలి. ప్రజలకు తాయిలాలు ప్రకటించడం, భావోద్వేగాలు రెచ్చగొట్టడం పక్కన పెట్టాలి. కేవలం ప్రజా సమస్యలు, దేశ సమస్యలు ఎజెండాగా ఎన్నికల్లో ప్రచారం చేయాలి. అప్పుడే వశ్వసనీయత ఉంటుంది. అందుకు అన్ని పార్టీలు ముందుకు రావాలి. భావోద్వేగాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు బిజెపి కావచ్చు,కాంగ్రెస్ కావచ్చు.. ఇతర పార్టీలు కావచ్చు.. చేయరాదు. ఇలాంటి వాటిని ఇసి తీవ్రంగానే పరిగణించాలి. అలాంటి వారిని కెసిఆర్ లాగా ప్రచారానికి దూరం చేయాలి.

# ఎప్రిల్‌లోనే నిప్పులకుంపటి

## - మేలో మరింత వేడి తప్పదు - వాతావరణశాఖ హెచ్చరిక



**న్యూఢిల్లీ,మే2:** ఈ ఏడాది ఏప్రిల్ ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యాయి. మేలో అంతకుమించి అన్నట్లుగా ఉండనున్నాయి. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే. 1901 తర్వాత తొలిసారిగా ఏప్రిల్ ఉష్ణోగ్రతలు భారీగా రికార్డయ్యాయి. దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఏప్రిల్‌లో వడగాలులు కొనసాగాయి. మే నెలలోనూ ఎండలు, వడగాలులు కొనసాగుతా యని వాతావరణ శాఖ తెలిపింది. ఉష్ణోగత్రలు చాలా ప్రాంతాల్లో మరింత పెరిగే అవకాశాలున్నాయని, 11 రోజుల పాటు వడగాలులు వీచే అవకాశాలున్నాయని అంచనా వేసింది. ఇప్పటికే 2023 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డులకెక్కింది. భారత వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర మాట్లాడుతూ ఏప్రిల్ 5 నుంచి 7 వరకు, 15 నుంచి 30 వరకు వడగాలులు వీచినట్లు తెలిపారు. సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 31 డిగ్రీలుగా నమోదైందని తెలిపారు. ఏప్రిల్ మాసంలో తూర్పు, ఈశాన్య భారతంలో సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 28.12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని పేర్కొన్నారు. 1901 తర్వాత ఆయా ప్రాంతాల్లో ఏప్రిల్ ఇంత కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవడం ఇదే తొలిసారి. 1980 నుంచి దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా మారాయన్నారు. దక్షిణ రాజస్థాన్, పశ్చిమ మధ్యప్రదేశ్, విదర్భ, మరాఠ్వాడా, గుజరాత్ ప్రాంతాల్లో మేలో 8–11 రోజుల పాటు వేడి తరంగాలు ఉండవచ్చని మహాపాత్ర చెప్పారు. రాజస్థాన్, తూర్పు మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఇంటీరియర్ ఒడిశా, గంగా పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, తెలంగాణలోని మిగిలిన ప్రాంతాల్లో ఐదు నుంచి ఏడు రోజుల వరకు వడగాలులు వీచే అవకాశాలున్నాయన్నారు.సాధారణంగా ఉత్తర భారతం, మధ్యభారతం, ద్వీపకల్ప భారత పరిసర ప్రాంతాల్లోని మైదాన ప్రాంతాల్లో దాదాపు మూడురోజుల పాటు వడగాలులుంటాయి. ఏప్రిల్‌లో ఎండలకు ప్రధాన కారణం ఉరుములతో కూడిన వర్షాలు లేకపోవడమేనని వాతావరణశాఖ పేర్కొంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, భారతదేశానికి ఆనుకుని ఉన్న తూర్పుతీరంలో అల్ప స్థాయిలో ఏర్పడిన తుఫాను వ్యతిరేక పరిస్థితుల కారణంగా తక్కువ వర్షాపాతం నమోదైంది. ఈ వాతావరణ దృగ్విషయం కారణంగా సముద్రం నుంచి వచ్చే గాలులు ఒడిశా, బెంగాల్ వైపు ఎక్కువగా వీయలేదని పేర్కొంది. మే నెలలో దేశవ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. మే నెలలో సాధారణ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 91–109 శాతం) కురిసే అవకాశం ఉంది.వాయువ్య భారతదేశం, మధ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, ద్వీపకల్పం, ఈశాన్య భారతదేశంలోని చాలా ప్రాంతాలు సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురిసే అవకాశం ఉన్నది. వెస్టర్న్ డిస్టర్బెన్స్ కారణంగా ఉత్తర, మధ్య భారతంలో ఉఏప్రిల్ నెలలో వర్షం, వడగళ్లు కురిశాయి. పశ్చిమ బెంగాల్‌లోని గంగా తీరంలో 15 ఏళ్లలో, ఒడిశాలో తొమ్మిదేళ్ల తర్వాత అత్యధికంగా వేడిగాలులు వీచినట్లుగా మోహపాత్ర పేర్కొన్నారు. దేశంలోని చాలా ప్రాంతాలలో మేలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయి. అయితే, ఈశాన్య భారతదేశంలోని చాలాప్రాంతాలతో పాటు మధ్య భారతం, ఈశాన్య ద్వీపకల్ప భారతంలోని పరిసర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం, సాధారణం కంటే తక్కువగా ఉండవచ్చని పేర్కొంది.

# రాజధాని లేకుండా పదేళ్లు పాలన

## - జగన్ ఐదేళ్ల కాలంలో అస్తవ్యస్థం - విశాఖపై గురిపెట్టి..కాలం గడిపిన సిఎం జగన్
## - ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశంగా అమరావతి

**విజయవాడ,మే2:** మళ్లీ అమరావతిని రాజధానిగా పునర్నిర్మిస్తామని తెలుగుదేశం కూటమి హామీ ఇచ్చింది. గత ఐదేళ్లుగా రాజధాని అన్నది లేకుండా పోయింది. ఎన్నికల ప్రచారంలో జగన్‌కు ఇది పెద్ద మైనస్ కాబోతున్నది. అమరావతిని దెబ్బతీసిన జగన్ చరిత్రలో నిలిచిపోతారు. రాజధాని లేకుండా చేశారు. ఇప్పుడు తెలుగుదేశం కూటమికి ఇది కలసి వచ్చే అవకాశంగా ఉంది. రాజధాని ప్రాంతాలతో పాటు, ఎపిలోనూ ఇప్పుడు రాజధానిపై చర్చ సాగుతోంది. ఈ అంశం ఎన్నికల్లో ప్రధాన చర్చగా మారింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో విచిత్ర పరిస్థితి నెలకొంది. పాలనాకేంద్రం అన్నది లేకుండా పోయింది. ఇక ఎపి రాజధాని ఏది అని అడిగితే చెప్పే పరిస్థితి లేదు. మూడు రాజధానులా అంటే అదీ లేదు. తలలేని మొండెంలా ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్లుగా కొనసాగింది. రాజధాని అంటూ ఒకటి లేకుండా చేసి..అభివృద్ధి వికేంద్రీకరణ అంటూ సిఎ వైఎస్ జగన్ ప్రతిపాదనను మంత్రులు, అధికారులు తానా అంటే తందానాలాగా ప్రచారం చేపట్టారు. విశాఖ రాజధాని అన్న సిఎం జగన్ దానిని కూడా సాకారం చేయలేకపోయారు. రాజధాని, పాలనాకేంద్రాలపై ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలతో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియ్యకుండా పోయింది. లేదు. ఓ వ్యూహం ప్రకారం ప్రజలకు, పాలకులకు మధ్య సంబధాలు లేకుండా చేశారు. ప్రభుత్వంలో ఏం జరుగుతుందో తెలుసుకునే పరిస్థితి లేకుండా చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే పరిస్థితి లేదు. జగన్ అధికారంలోకి వస్తే ఇలాంటి దుర్గతి వస్తుందని ఎవరుకూడా ఊహించి ఉండరన్న ఆరోపణలుఉన్నాయి. అభివృద్ధి వికేంద్రీకణ వేరు..రాజధాని వేరు అన్న స్పృహలో నేతలు లేరు. వారు చెప్పిందే వేదంలాగా..తాము పట్టిన కుందేటికి మూడు రాజధానులు అన్న చందంగా పాలన సాగించారు. అందుకే అక్కడ ఆందోళనలు కొనసాగాయి. అయినా ప్రభుత్వం చలించలేదు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి పాలనా వ్యవహారాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేసారు. జగన్ ఏం చేస్తున్నారో ఎవరికీ తెలియదు. నిరంకుశ పాలన సాగుతున్నా ప్రశ్నించేవారు లేకుండా పోయారు. అలాగే ప్రశ్నించే వారిని ద్రోహులుగా చిత్రీకరించారు. ఇక అమరావతికి సంబంధించి ...రాజధానిగా అమరావతినే కొనసాగించాలని, మూడు రాజధానుల నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ నాలుగేళ్లుగా సాగిస్తున్న ఉద్యమం లో పోలీసుల కేసులు పెరిగాయి. పలువురు రైతులు, మహిళలు కోర్టులు చుట్టూ తిరగడంతోనే సరిపోయింది. కేసులతో వారిని కోర్టులకే పరిమితం చేస్తే ఇక ఉద్యమంలో కనిపించరన్న ఎత్తుగడ ఫలించింది. నిరసనకారులపై అనేక కేసులు నమోదయ్యాయి. వీరిలో చాలామందిని వివిధ జైళ్లకు తరలించారు. కొందరు బెయిలుపై విడుదలయ్యారు. వారంతా టిడిపి సానుభూతిపరులన్న ముద్రలు వేసి జగన్ ప్రభుత్వం చోద్యం చూస్తోంది. శాంతిభద్రతలకు ఆటంకం కలిగించినందు వల్లనే కేసులు పెట్టామని పోలీసులు తప్పించు కుంటున్నారు.అమరావతిలో నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు పోలీసులు పలు రకాలుగా ఆంక్షలు విధించారు. సెక్షన్ 144, సెక్షన్ 30 కూడా అమల్లో కి తీసుకొచ్చారు. ఈ కారణంగా అనేకమంది రైతులు ఉల్లంఘనల కేసులను ఎదుర్కొంటున్నారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అన్న చందంగా కేసులకు కొదవ లేకుండా పోయింది.

# ఆర్థిక వ్యవస్థపై కార్పోరేట్ ప్రభావం

## కుదేలవుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ
## మాంద్యం నుంచి ఒడ్డున పడే చర్యలు శూన్యం

**న్యూఢిల్లీ,మే2:** పాలకుల తీరు కారణంగా దేశంలో ధనిక, పేద వ్యత్యాసం బాగా పెరిగిపోయింది. ఆర్థిక మాంధ్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుల, మత, వర్ణ వివక్ష తీవ్ర రూపం దాల్చాయి. కేవలం కొన్ని కుటుంబాలే సంపద ఫలాలు అనుభవిస్తున్నాయి. మోడీ సర్కార్ వచ్చాక ఆయన తీసుకున్న నిర్ణయాలు కేవలం ధనికవర్గాలకే మేలు చేశాయి. మోదీ ప్రభుత్వం దేశాన్ని విపత్తులోకి నెట్టేసింది. కార్పొరేట్ శక్తుల అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోంది. నోట్ల రద్దు మొదలుకుని జీఎస్టీ వల్ల సామాన్య ప్రజల్లో కష్టాల్లో మగ్గుతున్నారు. నల్లధనాన్ని వెలికితీస్తానన్న మోదీ.. ఆ దిశగా చర్యలేవీ చేపట్టలేదు. మహిళలు, దళితులు, మైనారిటీలపై వందల సంఖ్యలో దాడులు పెరిగిపోయాయి. నిరుద్యో గాన్ని నిర్మూలించడంలో మోదీ విఫలమయ్యారు. ఫలితంగా రెండేళ్లలో దేశంలో 3.5శాతం మేర నిరుద్యో గం పెరిగింది. భాజపా ప్రభుత్వం పూర్తిగా నియంతృత్వ ధోరణిని అవలంబిస్తోంది. ఈ ప్రభుత్వ వైఖరితో ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం ఏర్పడింది. రైతులు, కార్మికులు, మహిళలు, మైనారిటీలు, యువత.. ఇలా అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి నెలకొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే ఆర్థికమాంద్యం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణానికి విరుగుడుగా ఆర్థికమాంద్యాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఎగుమతులు పెరగడం మాట అటుంచి తగ్గే ప్రమాదం ఉంది. ఇక గృహాల, భూముల మార్కెట్ విలువలను కృత్రిమంగా పెంచడం ద్వారా మన దేశంలో అంతగా ఫలితాన్ని సాధించడం లేదు. ఒక చిన్న సామాజిక తరగతిని మరింత ధనవంతులుగా చేయడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. మొత్తంగా చూస్తే మన దేశ ఆర్థిక వృద్ధి అనేది పెరుగుతుందని ఆశించడానికి ఏ కారణమూ కనిపించడం లేదు. పైగా అది తగ్గుముఖం పడుతోందని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. పెట్టుబడుల వృద్ధి రేటు తగ్గుతోంది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వినిమయం తగ్గుతోంది. ఐఎంఎఫ్ కూడా ప్రైవేటు వ్యక్తుల వినిమయంగాని, పెట్టుబడులు గాని పెరగని కారణంగానే భారతదేశ ఆర్థికవృద్ధి తగ్గుముఖం పట్టనున్నట్టు చెప్తోంది. ఇంత తేడా ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా దానిని అధిగమించగలిగే పరిస్థితి ఎటుతిరిగీ లేనే లేదు.ఇన్ని పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం తాను ఏయే పద్దుల మీద ఖర్చు చేస్తోందో ఆ ఖర్చు కేటాయింపులను మార్చితే మన ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని ప్రేరేపించే అవకాశాలు ఉన్నాయి.సరుకుల ఉత్పత్తి ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో జరుగుతుంది. ఆ పరిశ్రమలకు మిగిలే లాభాలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేగాక, ఆ చిన్న పరిశ్రమల యజమానులు తమ వద్దకు వచ్చిన సొమ్మును మళ్ళీ పెట్టుబడి రూపంలోనో, ఖర్చు రూపంలోనో మార్కెట్ లోకి మరోసారి పంపిస్తారు. ఆ విధంగా శ్రామిక ప్రజలకు నేరుగా అందేలా ప్రభుత్వం ఖర్చు చేస్తే అది రెండు, మూడింతలు మార్కెట్ లో వినిమయం జరగడానికి, అంటే డిమాండ్ పెరగడానికి దోహదపడుతుంది. అదే మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తే అప్పుడు ఆ ఖర్చులో ఎక్కువ భాగం దిగుమతుల కోసం గాని, ప్రాజెక్టులు చేపట్టిన కార్పొరేట్ల దగ్గర మిగులు రూపంలో గాని ఉండిపోతుంది. మార్కెట్ లోకి ఎక్కువ భాగం రావడం అనేది ఉండదు. అందువలన మార్కెట్ లో డిమాండ్ పెరగడానికి అంతగా దోహదపడదు. ఈ క్రమంలో దేశీయ ఆర్థిక విధానం అవసరం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు అవసరమైన చర్యలకు ఉపక్రమించాలి.

# అన్ని వర్గాలను ఆదుకున్న కెసిఆర్

## అభివృద్ధి బిఆర్‌ఎస్‌లోనే సాధ్యం: బాజిరెడ్డి



**నిజామాబాద్,మే2:** బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలను ఆదుకున్న ఘనత నాటి సిఎం కెసిఆర్‌దని నిజామాబాద్ బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. కానీ నాలుగు నెలలకే కాంగ్రెస్ మడత చుట్టేసిందని, అభివృద్ధి వెనక్కి పోయిందని అన్నారు. నీళ్లు, కరెంట్ ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. తెలంగాణ సమాజంలో అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేస్తున్న ఘనత కేసీఆర్‌దని బాజిరెడ్డి అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత తెలంగాణలో మాత్రమే అన్నారు. గత పాలకులు 70 ఏళ్లలో చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిళ్లలో చేసి చూపించారని పేర్కొన్నారు. తెలంగాణలో కరువును పారదోలేందుకు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. దీంతో పాటు మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ వంటి ఆధునిక జలాశయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే భూగర్భజలాలలు పెరిగాయ న్నారు. రైతులకునీరు, రైతుబంధు సాయం వంటివి అందడం,ధాన్యం కొనుగోళ్లు చేపట్టడంతో వారు సుఖంగా ఉన్నారని అన్నారు. కేంద్రం ధాన్యం కొనుగోళ్లకు ముందుకు రాకున్నా కెసిఆర్ ముందుకు వచ్చి ధాన్యం కొనుగోళ్లను చేపట్టారని అన్నారు. దిగుబడి పెంచేందుకు రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించేలా చేశారని అన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వీటిని కొనసాగించడం లేదన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, ఆ పార్టీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు. పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు తెలిపారు. పేదలు, రైతులకు సంక్షేమ పథకాలు పక్కాగా అందాయని గుర్తుచేశారు. రైతులకు వరికి రూ.500 బోనస్ ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ పార్టీ..ఇప్పుడు నోరెత్తడం లేదని విమర్శించారు. ప్రజలను అబద్దాలతో ఆగంచేసే కాంగ్రెస్, బీజేపీ కావాలా.. అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్ కావాలో ప్రజలు నిర్ణయించు కోవాలని సూచించారు.


# వందశాతం మళ్లీ చంద్రబాబే ముఖ్యమంత్రి

## టిడిపి గెలుపు ఖాయమై పోయింది: జివి

**గుంటూరు,మే2:** తమ నేత చంద్రబాబును మళ్లీ తెచ్చుకోవాలన్న ఉద్దేశంతోనే ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారని, టిడిపిని నమ్మి కేసులకు సైతం జడవకుండా పోరాడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు జివి ఆంజనేయులు అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు బ్రహ్మాండమైన స్వీప్‌తో గెలుస్తారని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఐదేళ్ల పాటు చంద్రబాబు అద్భుత పాలన సాగించారని అన్నారు. అమరావతి నిర్మించకుండా జగన్ నమ్మక ద్రోహం చేశాడని విమర్శించారు. అయినా మొక్కవోని విశ్వాసంతో చంద్రబాబు ఏపీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపారని, అయితే జగన్ పాలనలో ఎపి వెనక్కి పోయిందని అన్నారు. జగన్‌లు టిడిపిని దెబ్బతీసేందుకు ఎన్ని కుట్రలు చేస్తున్నా..అంతిమ విజయం టిడిపిదేనని విమర్శించారు. ఎన్నికల్లో వీరి కుట్రలను ప్రజలు తిప్పికొడతారని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో తెదేపా గెలుపు ఖాయమై పోయిందని అన్నారు.

# రింకూను పక్కన పెట్టడం సరికాదు

## మాజీ క్రికెటర్ల విశ్లేషణలు



**న్యూఢిల్లీ,మే1:** టీ20 ప్రపంచకప్ జట్టులోకి రింకూ సింగ్‌కు స్థానం కల్పించకపోవడం అతిపెద్ద షాక్‌గా క్రికెట్ మాజీలు, విశ్లేషకులు భావిస్తున్నారు. ధోనీని తలపించేలా మ్యాచ్‌లకు అద్భుతమైన ఫినిషింగ్‌ను ఇవ్వగల సత్తా అతడి సొంతం. కేవలం 15 అంతర్జాతీయ టీ20లు ఆడిన అతడు 176 స్ట్రయిక్ రేటుతో 356 పరుగులు సాధించాడు. సగటు 89. ఈ సారి ఐపీఎల్ సీజన్‌లో అతడు 82 బంతులు ఆడి 150 స్టైక్ర్ రేటుతో 123 పరుగులు చేశాడు. హార్దిక్, అర్ష్‌దీప్ వంటి వారి ఎంపికకు ఐపీఎల్ ఆటతీరును ప్రామాణికంగా తీసుకోని సెలక్టర్లు.. రింకూ విషయంలో మాత్రం దానిని ఎందుకు తీసుకొన్నారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కేకేఆర్ జట్టు బ్యాటింగ్‌లో తగినన్ని అవకాశాలు ఇచ్చి రింకూకు సహకరించలేదని ఆకాశ్ చోప్రా పేర్కొన్నాడు. 'టీ20ల్లో రింకూ సింగ్ విస్మరించలేని ఆటగాడు. అతడు జట్టులో లేకపోవడం ఆశ్చర్యకరం. ఆరు నెలల క్రితం మనం టీమ్‌ను ఊహించుకొంటే 11 మందిలో తొలుత అతడి పేరే ఉండేది. యశస్వితో కలిసి అతడు ఆడతాడని అనుకొన్నాం. ఇటీవల రింకూ ఫామ్‌నే సెలక్టర్లు చూశారు. కోల్‌కతా అతడికి తగినన్ని బ్యాటింగ్ అవకాశాలు ఇవ్వలేదు. అది అతడి ఎంపికపై ప్రభావం చూపింది. రింకూ–దూబే మధ్య షూటౌట్ వంటి పరిస్థితులు నెలకొన్నాయి. సెలక్టర్లు శివం వైపు మొగ్గారు. జట్టులో ఆల్‌రౌండర్లు లేకపోవడం కూడా రింకూ ఎంపికపై ప్రభావం చూపింది. జడేజా టీ20ల్లో పెద్ద ఆల్‌రౌండర్ కాదు. టాప్–6లో హార్దిక్ పాండ్యా కొద్దిగా బౌలింగ్ చేస్తాడు. ఇక లెఎ÷–టార్మ్ స్పిన్నర్లంల్గ÷న జడ్డూ, అక్షర్ ఇద్దరూ ఒకేసారి జట్టులో ఉండే పరిస్థితి లేదు. దీంతో టాప్ సిక్స్‌లో సరిగ్గా బౌలింగ్ చేసే ఆల్‌రౌండర్ కరవయ్యాడు. రింకూ బౌలర్ కాదు. దీంతో అతడు బలయ్యాడు. ప్రపంచకప్‌లో ఆడే అవకాశం ఈ సారి మిస్ అయితే.. తర్వాత వస్తుందిలే అనుకొంటారు.. కానీ, ఎప్పటికీ రాదు. కావాలంటే వీవీఎస్ లక్ష్మణ్‌ను అడగండి. జట్టులో లెఫ్ట్‌హ్యాండర్ల సంఖ్య పెరగడం కూడా రింకూను ట్రావెల్ రిజర్వ్‌కు పరిమితం చేయడానికి కారణం కావచ్చు. రోహిత్, కోహ్లీతో ఇన్నింగ్స్ ఓపెన్ చేయించినా. తర్వాత సూర్యకుమార్‌ను తప్పితే.. దూబె,పంత్,రింకూ లెఫ్ట్‌హ్యాండ్లంల్గ÷పోతారు. దీంతో జట్టు కూర్పు కోసం కూడా అతడిని పక్కన పెట్టి ఉండొచ్చు' అని చోప్రా విశ్లేషించాడు. ఈ ఏడాది జనవరి వరకు రెండు అర్ధశతకాలతో 176 స్టైక్ర్ రేటుతో పరుగుల చేసిన వ్యక్తికి టీ20 ప్రపంచకప్ జట్టులో స్థానం ఇవ్వకపోవడం అన్యాయమని మాజీ క్రికెటర్ శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. అసలు జట్టు ఎంపిక వెనుక ఉన్న హేతుబద్ధతను ఆయన ప్రశ్నించారు. 'ఈ ఎంపికపై నేను సంతోషంగా లేను. రింకూ గురించి ప్రపంచం మొత్తం మాట్లాడుకుంటోంది. అవకాశం వచ్చిన ప్రతిసారీ నిరూపించు కొన్నాడు. అలాంటి వ్యక్తిని జట్టు నుంచి ఎలా డ్రాప్ చేస్తారు. మీరు ఎవరిని తప్పించినా నాకు ఏమీ అనిపించదు.. కానీ, రింకూని మాత్రం జట్టులోకి తీసుకోవాల్సిందే. అవసరమైతే యశస్విని పక్కనపెట్టినా ఇబ్బంది లేదు. రింకూ దక్షిణాఫ్రికాలో విజయాలను అందించే ఇన్నింగ్స్‌లు ఆడాడు. అఎ÷–గానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒంటిచేత్తో జట్టును ఆదుకొన్నాడు. టీమ్‌కు అవసరమైన ప్రతిసారీ పూర్తి స్థాయిలో ఆడాడు. ఇదో చెత్త సెలక్షన్. మీకు (సెలక్టర్లను ఉద్దేశించి) అసలు నలుగురు స్పిన్నర్లు ఎందుకు..? వీరంతా ఆడాల్సిందేనా..? ఎవరో కొందరిని సంతోష పెట్టడానికి జట్టును ఎంపిక చేశారు. ఈ క్రమంలో రింకూను బలిపశువుగా మార్చారు' అని శ్రీకాంత్ తీవ్రంగా ప్రశ్నించారు.

## ఐపిఎల్ వేరు..ప్రపంచ కప్ వేరు

### సునీల్ గవాస్కర్ విశ్లేషణ

**న్యూఢిల్లీ,మే1:** టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టును ప్రకటించిన తర్వాత వివిధ వర్గాల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. కొందరు టీమ్ సమతూకంగా ఉందని అభినందించగా.. కొందరు ఫామ్‌లో లేని వారిని ఎందుకు ఎంపిక చేశారంటూ విమర్శలు చేశారు. మరీ ముఖ్యంగా ఐపీఎల్‌లో పెద్దగా రాణించలేక పోతున్న హార్దిక్ పాండ్య సెలక్షన్‌పై సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి. పది మ్యాచుల్లో కేవలం 197 పరుగులు చేసిన పాండ్య 4 వికెట్లను మాత్రమే తీశాడు. అతడినే వైస్ కెప్టెన్‌గా చేయడం గమనార్హం. తాజాగా వాటిపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'ఐపీఎల్‌లో ఆడటం.. దేశం కోసం ప్రాతినిధ్యం వహించడానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. జాతీయజట్టుకు ఆడేటప్పుడు ప్రతీ ఆటగాడు గర్వంగా ఫీలవుతాడు. హార్దిక్ పాండ్య విషయంలోనూ ఇదే ఉంటుంది. ఐపీఎల్‌లో అతడు చాలా సమస్యలను అధిగమిస్తూ ఉన్నాడు. వాటిని చక్కగా నిర్వహిస్తుండటం అభినందనీయం. వరల్డ్ కప్‌లో భారత్ తరఫున పాండ్య విదేశాల్లో ఆడనున్నాడు. ఇప్పుడున్న పరిస్థితి నుంచి పూర్తి భిన్నమైన మైండ్‌సెట్‌తో బరిలోకి దిగుతాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో హార్దిక్ భాగస్వామ్యం అత్యంత కీలకం కానుంది. తప్పకుండా టీమ్‌ఇండియా టైటిల్ రేసులో ముందుంటుంది. అంతర్జాతీయ స్థాయిలో కొన్నిసార్లు అదృష్టమూ కలిసిరావాలి. ఇప్పుడీ టీమ్‌కు లక్ ఉందని భావిస్తున్నా. 2007 మళ్లీ పునరావృతం కావడం ఖాయం.

# సంజూ శాంసన్‌కు ప్రపంచకప్‌లో చోటు

## మళయాలంలో పోస్ట్ చేసిన సంజూ



**న్యూఢిల్లీ,మే1:** ఎట్టకేలకు భారత ఆటగాడు సంజూ శాంసన్ ప్రపంచ కప్ జట్టులోకి అడుగుపెట్టాడు. గత వన్డే వరల్డ్‌కప్ సమయంలోనూ అతడి పేరు బాగా వినిపించినా.. కొన్ని సమీకరణాల వల్ల సంజూకు చోటు దక్కలేదు. ఈసారి మాత్రం అద్భుతమైన ఫామ్‌తో ఐపీఎల్‌లో పరుగులు చేస్తుండటంతో అవకాశం వెతుక్కుంటూ వచ్చింది. రిషభ్ పంత్‌కు బ్యాకప్‌గా సంజూను తీసుకున్నా.. మిడిలార్డర్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్‌గానైనా బరిలోకి దింపే అవకాశం లేకపోలేదు. దీంతో తమ అభిమాన ఆటగాడికి అవకాశం దక్కడంపై సోషల్ మీడియా ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సంజూ తన మాతృభాష మలయాళంలో చేసిన పోస్టు వైరల్‌గా మారింది. 'వియర్పు తునియిట్టా కుప్పాయమ్'.. ఇదీ సంజూ చేసిన పోస్టు. దీనికి అర్థం 'చెమట, కష్టంతో కుట్టిన చొక్కా'. భారత జాతీయజట్టులో అరంగేట్రం చేసిన చాన్నాళ్లకు ఇప్పుడు అవకాశం రావడంతో అతడు ఇలా స్పందించాడని క్రికెట్ పండితులు చెబుతున్నారు. 2015లో భారత జట్టు తరఫున టీ 20ల్లోకి అడుగుపెట్టిన రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ నిలకడగా జాతీయజట్టులో స్థానం దక్కించుకోలేకపోయాడు. ఐపీఎల్‌లో భారీగా పరుగులు చేస్తున్నా.. సెలెక్టర్లు మాత్రం అతడిని పక్కన పెట్టేశారు. ఇప్పటివరకు కేవలం 25 అంతర్జాతీయ టీ20లను ఆడిన సంజూ 374 పరుగులు చేశాడు. ఓపెనర్, మిడిలార్డర్‌లో పరుగులు చేయడం అతడి స్పెషాలిటీ. ఐపీఎల్‌లో 161 మ్యాచుల్లో ఆడిన అతడు 4,273 పరుగులు రాబట్టాడు. ఇందులో మూడు సెంచరీలు, 24 హాఫ్ సెంచరీలూ ఉన్నాయి. ఇప్పుడు భారత జట్టు తరఫున వరల్డ్ కప్ బరిలోకి దిగుతున్న సంజూకి తుది జట్టులోనూ స్థానంలో కల్పించాలని అభిమానులు కోరుతున్నారు.

# బరువు తగ్గేందుకు పంత్ కఠోర శ్రమ

## నోటిని కట్టేసుకుని కసరత్తులు



**న్యూఢిల్లీ,మే1:** రోడ్డు ప్రమాదం జరిగిన దాదాపు 15 నెలల తర్వాత భారత స్టార్ ఆటగాడు రిషభ్ పంత్ మైదానంలోకి అడుగు పెట్టాడు. అందుకోసం తీవ్రంగా శ్రమించాడు. ఫిట్‌నెస్ సాధించడానికి, బరువును తగ్గించుకోవడానికి దాదాపు నాలుగు నెలలపాటు 'నోరు'ను కట్టడి చేసుకున్నాడు. ఐపీఎల్ 17వ సీజన్‌లో అదరగొట్టేస్తున్న అతడు టీ20 ప్రపంచ కప్ జట్టులోకి అడుగు పెట్టాడు. ఆహార నియమాలపై రిషభ్ పంత్ కఠినంగా ఉన్నట్లు అతడి డైట్‌లో భాగస్వాములైన వర్గాలు వెల్లడించాయి. ఫ్రైడ్ చికెన్, రసమలై, బిర్యానీకి దూరంగా ఉన్నాడట. అయితే, చిల్లీ చికెన్‌ను కేవలం 5 ఎంఎల్ ఆలివ్ ఆయిల్‌తో తయారు చేసుకుని తిన్నాడట. ప్రమాదానికి ముందు కాస్త బొద్దుగా ఉండే పంత్‌ను ఇప్పుడు చూస్తే చాలా వ్యత్యాసం కనిపిస్తుందని మాజీ క్రికెటర్లూ ప్రశంసలు కురిపించారు. 'కేలరీలను తగ్గించుకునేందుకు పంత్ చాలా కష్టపడ్డాడు. అతడి శరీరం 1400 కేలరీలను కోరుకుంటే.. వెయ్యి మాత్రమే ఇచ్చేవాడు. మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించడానికి అవసరమైన కసరత్తులు ప్రారంభించిన తర్వాత డైట్ మరింత కఠినతరం చేశాడు. కుడి కాలు గాయం నుంచి కోలుకుని బలంగా మారేందుకు శ్రమించాడు. పంత్ తన ఆహారం విభిన్నంగా ఉండాలని కోరుకుంటాడు. అందుకోసమే, ఎన్సీఏ పర్యవేక్షణలో ఉంటూనే బెంగళూరు ఓ రెంట్ హౌస్‌కు మారిపోయాడు. హోటల్ ఫుడ్ కంటే ఇంట్లో తయారు చేసిన ఆహారానికే ప్రాధాన్యం ఇచ్చాడు. కేవలం ఐదు ఎంఎల్ ఆలివ్ ఆయిల్‌తోనే తన వంటను చేయించుకొనేవాడు. అన్ని రకాల ఫుడ్‌ను వదిలేసినప్పటికీ చిల్లీ చికెన్‌ను మాత్రం తినేందుకు మొగ్గు చూపాడు. చాలా తక్కువ ఆయిల్‌తోనే ఆహారాన్ని తయారు చేయించుకొని తినేవాడు. అతడికి బెండకాయ కూరంటే చాలా ఇష్టం. సమయానికి నిద్రకు ఉపక్రమించేవాడు. టీవీ, ఫోన్, ఇతర గ్యా÷–జెట్స్‌ను రాత్రి 11 గంటలకల్లా పక్కన పెట్టేసేవాడు. ఎలాంటి ఆటంకం లేకుండా కనీసం 8 గంటల నిద్ర పోయేవాడు. ఉదయం కఠినమైన శిక్షణ కోసం సిద్ధంగా ఉండేవాడు. ఇలా చేయడం వల్ల కేవలం నాలుగు నెలల వ్యవధిలో 16 కేజీల వరకు బరువు తగ్గాడు' అని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.

# వాహన అమ్మకాల జోరు



**న్యూఢిల్లీ :** వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. నూతన ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే వాహన అమ్మకాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ప్యాసింజర్ వాహనాలకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండటంతోపాటు సార్వత్రిక ఎన్నికలు జరుగుతుండటంతో స్వల్పంగా ప్రభావం చూపాయి. మొత్తంగా గత నెలలో 3,38,341 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 3,32,468లతో పోలిస్తే 1.77 శాతం పెరిగాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్‌లు సింగిల్ డిజిట్ వృద్ధిని నమోదు చేసుకోగా, టాటా మోటర్స్, టయోటా కిర్లోస్కర్ రెండంకెల వృద్ధిని సాధించాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత మళ్లీ పుంజుకునే అవకాశాలున్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

# గ్రోత్ గైడెన్స్ అంచనాలు తగ్గింపుతో ఇన్ఫీ షేర్ పతనం




దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రోత్ గైడెన్స్ అంచనాలను కుదించడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడింది.

ఇన్ఫీ గ్రోత్ గైడెన్స్ అంచనాలు మార్కెట్ వర్గాలకు రుచించక పోవడంతో శుక్రవారం ఇన్ఫీ షేర్ దాదాపు ఒకశాతం నష్టపోయింది. బీఎస్ఈలో ఇన్ఫీ షేర్ అంతర్గత ట్రేడింగ్ లో 2.87 శాతం నష్టపోయినా, ట్రేడింగ్ ముగిసే సమయానికి 0.63 శాతం నష్టంతో రూ.1411.60 వద్ద ముగిసింది. మరోవైపు ఎన్ఎస్ఈలో ఇన్ఫీ షేర్ ఇంట్రాడే ట్రేడింగ్ లో 2.85 శాతం పతనంతో రూ.1,378.75 వరకూ పడిపోయినా చివరకు 0.51 శాతం నష్టంతో రూ.1,411.95 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,655.37 కోట్లు నష్టపోయింది. 2023–24 ఆర్థిక సంవత్సర మార్చి త్రైమాసికం ఫలితాలు ప్రకటించిన ఇన్ఫోసిస్ నికర లాభాల్లో 30 శాతం గ్రోత్ నమోదు చేసింది. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రోత్ అంచనాలను 1–3 శాతానికి పరిమితం చేసింది.

**రెండు రోజుల్లో నెస్లే ఎం-క్యాప్ రూ.10,610 కోట్లు లాస్**

నెస్లే ఇండియా షేర్ల పతనం రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. గ్లోబల్ ఎఫ్ఎంసీజీ మేజర్ నెస్లే ఇండియా..

# రియల్‌మీ నుంచి నార్జో 70 సిరీస్ ఫోన్లు

## రూ.11,999 నుంచి షురూ..!





70 ఎ ప్రముఖ చైనా స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ తన రియల్‌మీ నార్జో 70 సిరీస్ ఫోన్లను భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. ఈ సిరీస్ ఫోన్లలో రియల్‌మీ నార్జో 70 5జీ, రియల్‌మీ నార్జో 70ఎక్స్ 5జీ ఫోన్లు ఉన్నాయి. రెండు ఫోన్లలోనూ 45వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ, 50–మెగా పిక్సెల్ మెయిన్ కెమెరా ఉంటాయి. రెండు ఫోన్లూ ఆండ్రాయిడ్ 14 బేస్డ్ రియల్‌మీ యూఐ 5.0 ఓఎస్ వర్షన్‌పై పని చేస్తాయి. రెండు ఫోన్లకూ ఐపీ54 రేటెడ్ రెసిస్టెన్స్ ఉంటది. రెండు కలర్ ఆప్షన్లు, రెండు ర్యామ్ స్టోరేజీ ఆప్షన్లలో లభిస్తాయి.

**రియల్‌మీ నార్జో 70 5జీ స్పెషిఫికేషన్స్ ఇలా**

రియల్‌మీ నార్జో 70 5జీ ఫోన్ 6జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.14,999, 8జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.15,999లకు లభిస్తాయి. మరోవైపు రియల్‌మీ నార్జో 70ఎక్స్ 5జీ ఫోన్ 4జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.10,999, 6జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.11,999లకు లభిస్తాయి. రెండు ఫోన్లూ ఫారెస్ట్ గ్రీన్, ఐస్ బ్లూ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది.

రియల్‌మీ నార్జో 70 5జీ ఫోన్ ఆండ్రాయిడ్ 14 బేస్డ్ రియల్‌మీ యూఐ 5.0 స్కిన్ ఓఎస్ వర్షన్ పై పని చేస్తుంది. మూడేండ్లు సెక్యూరిటీ అప్ డేట్స్, రెండేండ్లు సెక్యూరిటీ అప్ డేట్స్ అందిస్తుంది. 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్, 240 టచ్ శాంప్లింగ్ రేటుతో 6.67 అంగుళాల ఫుల్ హెచ్డీ ం (1080ఐ2400 పిక్సెల్స్) అమోలెడ్ డిస్ ప్లే ఉంటది. 1200 నిట్స్ పీక్ బ్రైట్ నెస్ కలిగి ఉంటుంది. 6ఎన్ఎం మీడియాటెక్ డైమెన్సిటీ 7050 5జీ ఎస్వోసీ చిప్ సెట్ విత్ ఆర్మ్ మాలీ జీ68 జీపీయూ ఉంటది. డైనమిక్ ర్యామ్ ఫీచర్ తో వస్తున్న ఈ ఫోన్ లో 50–మెగా పిక్సెల్ ప్రైమరీ సెన్సర్ కెమెరా, 2–మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16–మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటది. 128 జీబీ ఇన్ బిల్ట్ స్టోరేజీ కెపాసిటీ గల ఈ ఫోన్ లో ఒక టిగా బైట్ వరకూ స్టోరేజీ కెపాసిటీ పెంచుకోవచ్చు. రియల్‌మీ నార్జో 70 5జీ ఫోన్ 5జీ, వై–ఫై, బ్లూటూత్ 5.2 కనెక్టివిటీ కలిగి ఉంటుంది. బయో మెట్రిక్ అథంటికేషన్ కోసం ఇన్ డిస్ ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంటది. డ్యుయల్ స్టీరియో స్పీకర్స్ విత్ హీ–రెస్ ఆడియో సర్టిఫికేషన్, రెయిన్ వాటర్ స్మార్ట్ టచ్ ఫీచర్ ఉంటాయి. రియల్‌మీ నార్జో 70 5జీ ఫోన్ 45వాట్ల సూపర్ వూక్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ ఉంటుంది. బ్యాటరీ సింగిల్ చార్జింగ్ తో 518 గంటల పాటు స్టాండ్ బైగా ఉంటుంది. 61 నిమిషాల్లో 100 శాతం చార్జింగ్ అవుతుంది.

# నేడు హరిహరవీరమల్లు టీజర్ విడుదల



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ , క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ కాంబినేషన్‌లో ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఏ. దయాకర్‌రావు నిర్మిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు' ఈ సినిమాకు సంబంధించి ఇటీవల మేకర్స్ ఓ అప్‌డేట్ ఇచ్చిన విషయం తెలిసిందే. త్వరలో టీజర్ విడుదల అని తెలిపిన మేకర్స్.. తాజాగా టీజర్ ఎప్పుడు విడుదల కాబోతుందో తెలియజేశారు. మీ ముందుకు... 'ధర్మం కోసం యుద్ధం' త్వరలో! అని తెలుపుతూ.. టీజర్ అతి త్వరలో విడుదల చేయనున్నామని మెగా సూర్య ప్రొడక్షన్స్ సంస్థ అధికారికంగా ట్విట్టర్ ఎక్స్‌లో పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ టీజర్‌కు సంబంధించి తాజాగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. టీజర్‌ని గురువారం అంటే 2వ తేదీ ఉదయం 9 గంటలకు విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ అధికారికంగా తెలుపుతూ.. ఓ పోస్టర్ వదిలారు. ఈ పోస్టర్‌లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 'వీరమల్లు' గెటప్ షెడ్ కనిపిస్తోంది. చేతిలో పవర్ ఫుల్ కత్తితో యుద్ధానికి సిద్ధమైన సైనికుడిలా పవన్ కళ్యాణ్ కనిపిస్తున్నారు. వాస్తవానికి ఈ సినిమా ఆగిపోయినట్లుగా ఇటీవల వార్తలు వైరల్ అయ్యాయి. పవన్ కళ్యాణ్ పొలిటికల్‌గా బిజీ కావడంతో.. ఇక ఈ సినిమా సెట్స్‌కి వెళ్లడమే కష్టమే అనేలా వచ్చిన వార్తలకు నిర్మాత ఏఎం రత్నం.. ఎప్పటికప్పుడు క్లారిటీ ఇస్తూ వస్తున్నారు. ఇప్పుడు టీజర్ వదిలి.. అలాంటి వార్తలకు పూర్తిగా ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేయబోతున్నారు. ఎన్నికల అనంతరం పవన్ కళ్యాణ్ ఈ సినిమా బ్యాలెన్స్ షూట్‌లో పాల్గొనున్నారని తెలుస్తోంది. టీజర్ గూస్‌బంప్స్ తెప్పించడం ఖాయమని తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది.పవన్ కళ్యాణ్ కెరీర్‌లో తొలిసారి పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో నటిస్తున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. హరిహరవీరమల్లు రెండు పార్టులుగా రాబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే లాంఛ్ చేసిన హరిహరవీరమల్లు పోస్టర్లు, గ్లింప్స్ వీడియోలు సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. హరిహరవీరమల్లు అండ్ టీంపై వచ్చే హై ఆక్టేన్ యాక్షన్ సీన్లను ఇప్పటికే రామోజీఫిలింసిటీలో చిత్రీకరించారు. పవన్ కళ్యాణ్ మరోవైపు ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలు కూడా చేస్తున్నాడు.

## బాక్ పేరుతో తెలుగులో

# అరణ్మనై-4 విడుదల




కోలీవుడ్ సీనియర్ దర్శకుడు సుందర్ సి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'అరణ్మనై-4' . ఈ నెల 3న తమిళ, తెలుగు భాషల్లో విడుదల చేస్తున్నారు. తెలుగులో 'బాక్' అనే పేరు పెట్టారు. సుందర్ సి, తమన్నా, రాశీఖన్నా, రామచంద్రరాజు, కోవై సరళ, యోగిబాబు, వీటీవీ గణెళిష్ తదితరులు నటించారు. ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో హీరోయిన్ తమన్నా.. రాశీ ఖన్నా విరివిగా పాల్గొంటున్నారు. తాజాగా ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా రాశీ ఖన్నా మీడియాతో ముచ్చటిస్తూ.. ఈ కథ వినకుండానే ఈ సినిమాలో చేసినట్లుగా చెప్పుకొచ్చారు. ఆమె మాట్లాడుతూ.. 'ఈ సినిమా కోసం దర్శకుడు సుందర్ నన్ను సంప్రదించి కథ వినిపించేందుకు సిద్ధమయ్యారు. కానీ నేను మాత్రం కథ వినకుండానే ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించాను. నాకు ఆయనపై అంత నమ్మకం. ఆ నమ్మకంతోనే కథ వినకుండానే డేట్స్ ఇచ్చేశాను. నాకు హర్రర్ చిత్రాలంటే అమితమైన ఇష్టం. అలాంటి సినిమాల్లో షూటింగ్ పూర్తయిన తర్వాత చాలా ఎక్కువగా ప్రీ ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనులుంటాయి. ఇందులో తమన్నా చాలా అందంగా కనిపిస్తుంది, ఆమెతో కలిసి నటించడం గొప్ప అనుభూతినిచ్చింది. కామెడీ సన్నివేశాల్లో నటించే సమయంలో కష్టపడ్డాను. అయినప్పటికీ సీనియర్ నటి కోవై సరళతో కలిసి హాస్య సన్నివేశాల్లో నటించడం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ సిరీస్‌లో వచ్చిన అన్ని సినిమాలు మంచి విజయం సాధించాయి. ఇందులో హర్రర్, కామెడీ అన్నీ కూడా ఇంకాస్త ఎక్కువగానే ఉంటాయి. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా కూడా ప్రేక్షకులని మెప్పిస్తుందని ఆశిస్తున్నాను. ఇందులో చాలా సర్‌ప్రైజ్‌లుంటాయి. కచ్చితంగా ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుంది' అని అన్నారు.

# ఎన్టీఆర్‌ను కలిసిన అనుపమ్ ఖేర్

## సోషల్ మీడియాలో ఫోటో షేర్



'వార్2' షూటింగ్‌తో ఎన్టీఆర్ బిజీగా ఉన్నారు. దీని చిత్రీకరణ కోసం ఆయన ముంబయిలో బస చేసిన ఎన్టీఆర్ ఇటీవల అక్కడి స్టార్స్ పార్టీలోనూ ఈ హీరో సందడి చేశారు. తాజాగా సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ ఆయనను కలిశారు. తారక్‌తో దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. తన అభిమాన నటుడైన జూనియర్ ఎన్టీఆర్‌ను కలవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన పనిచేసే విధానం తనకెంతో ఇష్టమని ప్రశంసించారు. ఆయన ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ పోస్ట్‌పై తారక్ స్పందించారు. 'నన్నెప్పుడూ మెచ్చుకునే మీ పనితీరు కూడా మాటలకందనిది. భవిష్యత్తు తరాలకు మీరు స్ఫూర్తినిస్తూనే ఉండాలని కోరుకుంటున్నా' అని రాసుకొచ్చారు. ఈ ఫొటోను షేర్ చేస్తోన్న అభిమానులు.. 'ప్రశాంత్ నీల్-ఎన్టీఆర్ కాంబోలో రానున్న చిత్రంలో అనుపమ్‌ఖేర్ నటిస్తున్నారా?' అని కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరేమో 'వార్2'లో ఆయన ఉన్నారని భావిస్తున్నారు. ప్రస్తుతం తారక్ 'దేవర'లో నటిస్తున్నారు. దీని షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం పాటలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సముద్రతీరం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామా ఇది. ఈ చిత్రంతో జాన్వీ తెలుగు తెరకు పరిచయమ వుతుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ చిత్రం మొదటి పార్ట్‌ను అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనితో పాటు బాలీవుడ్‌లో హృతిక్ రోషన్ హీరోగా రూపొందుతోన్న 'వార్2'లోనూ ఎన్టీఆర్ నటిస్తున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో బాలీవుడ్‌తోపాటు వరల్డ్‌వైడ్‌గా ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నాడు జూనియర్ ఎన్టీఆర్.


# కైకేయిగా లారాదత్తా అంటూ ప్రచారం

## రామాయణంలో అవకాశం వస్తే తప్పక నటిస్తానని వెల్లడి



బాలీవుడ్ సినీ ప్రముఖులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రామాయణాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వంలో ఇది రానుంది. ఈ చిత్రంలోని నటీనటుల ఎంపికపై ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాకపోయినా సోషల్ మీడియాలో రకరకాల పేర్లు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా తాను కైకేయి పాత్రలో నటించనున్నట్లు వస్తోన్న వార్తలపై బాలీవుడ్ నటి లారా దత్తా స్పందించారు. 'రామాయణ'పై వస్తోన్న చాలా రూమర్స్ నేనూ వింటున్నాను. వాటి గురించి పట్టించుకోవట్లేదు. కానీ, వాటిని వినడం నాకు ఆనందాన్నిస్తుంది. ఎందుకంటే అంత గొప్ప సినిమాలో నటించాలని అందరూ కోరుకుంటారు. అవకాశమిస్తే అందులోని చాలా పాత్రలు చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. శూర్పణఖ, మండోదరి, కైకేయి.. వీటిల్లో ఏ పాత్ర ఇచ్చిన నేను పోషిస్తాను' అని చెప్పారు. ఇక ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు జోరుగా ప్రచారమవుతోంది. ఇప్పటికే దీని చిత్రీకరణ ప్రారంభమైందని కొన్ని ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. వాటిపై చిత్రబృందం స్పందించాల్సి ఉంది. భారీ బడ్జెట్‌తో సిద్ధం కానున్న ఈ చిత్రానికి 'కేజీఎఫ్' హీరో యశ్ సహ నిర్మాతగానూ వ్యవహరించనున్నారు. సినిమాకు ఎంతో ముఖ్యమైన సంగీతం కోసం మూవీ యూనిట్ ఆస్కార్ విజేతలను సెలక్ట్ చేసుకున్నట్లు సమాచారం. ఏఆర్ రెహమాన్‌తో పాటు హాలీవుడ్ ఫేమస్ మ్యూజిక్ డైరెక్టర్ హన్స్ జిమ్మెర్ దీనికి ట్యూన్స్ అందించనున్నట్లు తెలుస్తోంది. మూడు భాగాలుగా దీన్ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు. మొదటి పార్ట్‌ను 2025 దీపావళికి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు.

# ట్రెండింగ్ అవుతున్న పుష్ప సింగిల్ ప్రోమో లుక్




టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌అభిమానులతోపాటు మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా పుష్ప.. ది రూల్ . ఈ మూవీ నుంచి మ్యూజికల్ అప్‌డేట్ ఇస్తూ ఫస్ట్ సింగిల్ ప్రోమో పుష్ప ను లాంఛ్ చేయగా.. నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఫుల్ సాంగ్ లాంఛ్ కంటే ముందు ఏదో ఒక లుక్ విడుదల చేస్తూ క్యూరియాసిటీ పెంచేస్తున్నారు మేకర్స్. ఇండియా మాస్ సెన్సేషన్ పుష్పరాజ్ ఇక్కడ.. బ్లాక్ బస్టర్ సాంగ్‌తో స్వాగతం పలుకుదాం.. అంటూ సుమోలో నుంచి స్టైలిష్‌గా దిగుతున్న లుక్ పుష్ప పుష్ప సాంగ్ ఏ రేంజ్‌లో ఉండబోతుందో చెప్పకనే చెబుతోంది. ఇవాళ సాయంత్రం 5:04 గంటలకు లాంఛ్ చేయనున్నట్టు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీతోపాటు బెంగాలీ భాషల్లో విడుదల చేయనున్నట్టు తెలియజేస్తూ లాంఛ్ చేసిన తాజా స్టిల్ ట్రెండింగ్ అవుతోంది. ఈ మూవీ ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. సీక్వెల్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోండగా.. ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తు?న్నాడు. పుష్ప ది రూల్ ఆడియో హక్కులను అన్ని భాషల్లో పాపులర్ కంపెనీ భూషణ్ కుమార్ టీ సిరీస్ దక్కించుకుంది.

# షాహిద్‌కు పెద్ద ఫ్యాన్‌ను మృణాల్ ఠాకూర్



షాహిద్ కపూర్ హీరోగా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన చిత్రం 'జెర్సీ'. నాని కథానాయకుడి గా తెలుగులో వచ్చిన 'జెర్సీ' రీమేక్‌గా రూపొందింది. ఇందులో షాహిద్ సరసన మృణాల్ ఠాకూర్ నటించారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో ఆ సినిమాలోని ఓ సన్నివేశాన్ని గుర్తుచేసుకున్నారు.'నేను షాహిద్ కపూర్‌కు అభిమానిని. ఆయనతో కలిసి నటించే అవకాశం రాగానే వెంటనే ఓకే చెప్పాను. మొదటిరోజు షూటింగ్‌లో ఆయన నవ్వు చూస్తూ చాలాసేపు అలానే ఉండిపోయా. మీ నవ్వు తెరపై ఎలా ఉందో నిజంగా కూడా అలాగే ఉందని చెప్పాను. ఆయనతో నటించిన రోజులను జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. మంచి కో-స్టార్. అంతపెద్ద స్టార్‌తో నటించాలంటే మొదట ఇబ్బందిగా అనిపించింది. వారం తర్వాత అలవాటుపడ్డాను. ఆ సినిమాలో ఒక సన్నివేశంలో నటించాలంటే చాలా భయపడ్డాను. అందులో షాహిద్ కపూర్‌ను కొట్టే సన్నివేశం చాలా కఠినమైనది.

**Owner, Editor, Printed & Published :** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews.com .com, e-mail : quicktodaynews@gmail.com